# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 210

VEKUVA SAMAYAM TELUGU DAILY

⭑ Mahabubnagar ⭑ Hyderabad ⭑ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: మంగళవారం 01 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ద్వైపాక్షిక భేటీ నిర్వహించారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో సోమవారం ఈ సమావేశం జరిగింది. ఫిబ్రవరిలో ఇరాన్-అమెరికా యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరువురు నేతలు ప్రత్యక్షంగా కలుసుకోవడం ఇదే తొలిసారి భారత్-ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల తాజా పరిస్థితిని ఇరువురు నేతలు సమీక్షించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసి, విస్తరించాల్సిన అవసరం గురించి చర్చించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చితో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న సమయంలో ఈ కీలక భేటీ జరగడం ఆసక్తికరంగా మారింది. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం, హోర్ముజ్ జలసంధి మూసివేత, అమెరికా ఆంక్షల కారణంగా భారత్ సహా పలు దేశాల వాణిజ్య కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. భారత్‌కు ఇరాన్ భౌగోళికంగా, వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలక దేశం. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షల నేపథ్యంలో మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖి చర్చలు జరపడం రెండు దేశాల భవిష్యత్ సహకారానికి కీలక పరిణామంగా మారింది.




**సమయం ప్రతినిధి:** ఉత్తరప్రదేశ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సమాజ్‌వాదీ పార్టీ కీలక వ్యూహంతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటివరకు పార్టీకి ప్రధాన ఓటు బ్యాంక్‌గా ఉన్న ముస్లిం-యాదవ్ సమీకరణానికి మహిళా ఓటర్లను కూడా చేర్చే దిశగా అడుగులు వేస్తోంది. ఈ వ్యూహంలో పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ భార్య, మైన్‌పురి ఎంపీ డింపుల్ యాదవ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు కనిపిస్తోంది. 2017లో కుటుంబ రాజకీయాల ఆరోపణల నేపథ్యంలో డింపుల్ ఇకపై ఎన్నికల్లో పోటీ చేయరని అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. అయితే ఆ తర్వాత రాజకీయ పరిణామాలు మారిపోయాయి. డింపుల్ యాదవ్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు విజయం సాధించారు. ప్రస్తుతం ఆమె సమాజ్‌వాదీ పార్టీకి ప్రధాన మహిళా ముఖంగా ఎదిగారు. ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో మహిళా ఓటర్లు కీలక వర్గంగా మారుతున్నారు. అయితే ఈ విషయంలో సమాజ్‌వాదీ పార్టీకి గతంలో బలహీనత ఉంది. 2017లో కుటుంబ రాజకీయాల ఆరోపణల నేపథ్యంలో డింపుల్ ఇకపై ఎన్నికల్లో పోటీ చేయరని అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. అయితే ఆ తర్వాత రాజకీయ పరిణామాలు మారిపోయాయి. డింపుల్ యాదవ్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి రెండుసార్లు విజయం సాధించారు. ప్రస్తుతం ఆమె సమాజ్‌వాదీ పార్టీకి ప్రధాన మహిళా ముఖంగా ఎదిగారు. ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో మహిళా ఓటర్లు కీలక వర్గంగా మారుతున్నారు. అయితే ఈ విషయంలో సమాజ్‌వాదీ పార్టీకి గతంలో బలహీనత ఉంది.




**సమయం ప్రతినిధి:** న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటు వాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎక్స్ వేదికగా హెచ్చరించారు. న్యూయార్క్‌లో మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్ వేదికగా జరిగిన సభలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరైన సందర్భంగా స్టేడియం బయట జరిగిన ఈ ఘటన తాలూకు వీడియోను మంత్రి నెట్టింట షేర్ చేశారు. 'ఆర్‌ఎస్‌ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నాము. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. మీరు ఓ విషయాన్ని జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని కేంద్ర మంత్రి తన పోస్టులో వార్నింగ్ ఇచ్చారు. 'ఆర్‌ఎస్‌ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నాము. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. మీరు ఓ విషయాన్ని జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని కేంద్ర మంత్రి తన పోస్టులో వార్నింగ్ ఇచ్చారు. ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో AHEAD సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన ఈ సభలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగించారు. అమెరికాలో ఉంటూ ఉపాధి పొందే వారు కర్మ భూమి పట్ల తమ బాధ్యతను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.



## ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుంది: హరీశ్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 31, సమయం ప్రతినిధి:** తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. తుక్కుగూడలో నర్స్ హత్య ఘటనపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకే కాదని.. ప్రజల ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య అనంతరం అత్యాచారం జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచకాలు పెరిగి, శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత దారుణంగా మారుతుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుందని హరీశ్ ప్రశ్నించారు. 'మహిళలకు భద్రత కల్పించలేని మీకు హోం శాఖ నిర్వహించే నైతిక హక్కు ఉందా? ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చేయాలి. రాష్ట్రంలో దిగజారుతున్న మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని BRS పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు.

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఘాటైన వ్యాఖ్యలతో తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి? అంటూ సీఎం ఫైర్ అయ్యారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు పదవులు కట్టబెట్టారని విమర్శించారు. తాను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యాఖ్యానించారు. 'పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో మేం ఏం చేశామో అసెంబ్లీకి చర్చకు సిద్ధం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** సోమవారం సాయంత్రం ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలపై తీవ్ర విమర్శలు చేశారు.

**ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ అభివృద్ధి..**

హైదరాబాద్ అతివేగంగా విస్తరిస్తోందని.. ఈ మహానగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా మారిందని.. ప్రపంచంతో హైదరాబాద్ పోటీ పడుతోందన్నారు సీఎం. వివిధ రంగాలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. మౌలిక వసతుల విస్తరణ కూడా అవసరం అని పేర్కొన్న సీఎం.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ జరగడం లేదన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం చెప్పారు.

**3 భాగాలుగా తెలంగాణ :** అభివృద్ధి కోసం తెలంగాణను 3 భాగాలుగా విభజించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ పక్కన నివసించేవారి పరిస్థితి అత్యంత దయనీయం అని.. మూసీకి వరదలు వస్తే ప్రజలు ఎంతో నష్టపోతున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ముసారాంబాగ్ వంతెనను ఎందుకు నిర్మించలేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత రెండేళ్లలోనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. పదేళ్లలో అంబర్‌పేట్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టారా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. ఎక్కడో ఊరి బయట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టారంటూ విమర్శించారు.

**ప్రజల సమస్యలను పట్టించుకోలేదు :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేదని సీఎం రేవంత్ ఆరోపించారు. పేదల కష్టాలు తమకు తెలుసునని.. అందుకే ఇళు కట్టిస్తున్నామని సీఎం అన్నారు. బతుకమ్మకుంటను చెరబట్టింది ఎవరో అందరికీ తెలుసునని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి ఆరోపణలు గుప్పించారు సీఎం. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు చెరువు లేకుండా.. బతుకమ్మకుంటను కబ్జా చేశారన్నారు. హైడ్రాను పంపి బతుకమ్మకుంట చెర విడిపించామని చెప్పారు. ఆడబిడ్డలకు బతుకమ్మకుంటను బహుమతిగా ఇచ్చామన్నారు. మళ్లీ బతుకమ్మకుంట కబ్జాకు యత్నిస్తున్నారంటూ సీఎం ఆరోపించారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నాం తప్ప.. వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు తాము కట్టుకోలేదన్నారు.

**1000 రోజుల ప్రజాపాలన :** ప్రజాపాలన ఏర్పడి 1000 రోజులు పూర్తయ్యాయని సీఎం రేవంత్ తెలిపారు. ప్రజా ప్రభుత్వంపై బురద జల్లాలను కుట్రలు చేస్తున్నారంటూ విపక్షాలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం విఫలమైందని కొందరు విమర్శిస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి ఆశ్చర్యపోయామన్నారు సీఎం. ధనిక రాష్ట్రంగా తెలంగాణను కేసీఆర్‌కు అప్పగిస్తే.. అప్పులకుప్ప చేశారంటూ విమర్శలు గుప్పించారు. పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌కు ముందు ఉన్న సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు కాగా.. కేసీఆర్ ఒక్కరే రూ.7.50 లక్షల కోట్ల అప్పు చేశారన్నారు సీఎం రేవంత్. ఈ అప్పుల కోసం నెలకు రూ.7,500 కోట్ల అసలు, వడ్డీ కడుతున్నామని వివరించారు. ఏడాదికి రూ.80-90 వేల కోట్ల అప్పు కడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**సమయానికి వేతనాలు....**

ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నెలకు వెయ్యిమంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారని.. ఒక్కో ఉద్యోగికి బెనిఫిట్స్ కింద రూ.కోటి ఇవ్వాల్సివస్తోందన్నారు. గత 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేశామన్నారు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 6 నెలలకు ఓసారి వేతనాలు ఇచ్చేవారని.. ఇప్పుడు టైమ్ టు టైమ్ వేతనాలు చెల్లిస్తున్నామని సీఎం తెలిపారు.




**సమయం ప్రతినిధి:** పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతటి కష్టాన్నైనా భరిస్తారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు చెందిన 47 ఏళ్ల రమాబాయి రణ్‌వీర్ ఇందుకు గొప్ప ఉదాహరణగా నిలిచారు. కూతురి చదువు ఫీజు కోసం మారథాన్‌లో పాల్గొన్న ఆమె.. చెప్పులు కూడా లేకుండా చీరతోనే పరుగెత్తి విజేతగా నిలిచారు. బహుమతిగా వచ్చిన రూ.3,000ను తన కూతురి చదువు కోసం ఉపయోగించనున్నారు. మహారాష్ట్రలోని అంబాజోగైలో ఖోలేశ్వర్ ఎడ్యుకేషనల్ కాంప్లెక్స్ అమృత మహోత్సవ వేడుకల్లో భాగంగా 'అమృత్ దౌడ్' మారథాన్ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ చౌక్ నుంచి భాగ్యనగర్ చౌక్ వరకు ఈ పరుగు సాగింది. ఈ పోటీలో పలువురు యువతీ యువకులు స్పోర్ట్స్ షూస్, ట్రాక్‌సూట్లతో పాల్గొన్నారు. రమాబాయి మాత్రం సాధారణ చీర, చెప్పులతోనే పోటీకి వచ్చారు. ఆమె విజేతగా నిలుస్తారని అక్కడున్నవారు ఊహించలేదు. పరుగు ప్రారంభమైన కొద్దిసేపటికే రమాబాయి చెప్పులు జారిపోతుండడంతో వేగంగా పరుగెత్తడం కష్టంగా మారింది. దీంతో ఆమె చెప్పులను చేతితో పట్టుకుని ఒట్టి కాళ్లతోనే పరిగెత్తడం ప్రారంభించారు. చీరను కూడా సర్దుకుంటూ ఆమె వేగంగా పరిగెత్తారు. స్పోర్ట్స్ షూస్ ధరించిన యువ రన్నర్లు ఒక్కొక్కరినీ వెనక్కి నెట్టి రమాబాయి ఫినిషింగ్ లైన్‌ను అందరికంటే ముందుగా చేరుకున్నారు. దీంతో మారథాన్‌లో మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. మారథాన్‌లో మొదటి స్థానం సాధించిన రమాబాయికి రూ.3,000 నగదు బహుమతి లభించింది. ఈ మొత్తాన్ని తన కూతురి చదువుకు, ఫీజు చెల్లించేందుకు ఉపయోగించనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె విజయం చూసిన ప్రేక్షకులు, నిర్వాహకులు భావోద్వేగానికి గురయ్యారు. ఒక తల్లి తన పిల్లల చదువు కోసం చూపించిన పట్టుదలకు అభినందనలు తెలిపారు.

## రణరంగంగా మారిన నల్లగొండ.. కాంగ్రెస్, బీజేపీ దాడి, ప్రతిదాడులతో ఉద్రిక్తతలు..

**సమయం ప్రతినిధి:** జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య దాడి, ప్రతిదాడులు తీవ్ర రాజకీయ ఉద్రిక్తతలకు తెరలేపాయి. నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంపై బీజేపీ కార్యకర్తల దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ప్రతి దాడికి యత్నించాయి. పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్దకు హస్తం పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు.. బీజేపీ జిల్లా కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. కార్యాలయంపై దాడి చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయమైనట్లు సమాచారం. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంపై బీజేపీ శ్రేణుల దాడిని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలతో దాడులకు తెగబడటం సరికాదని ఆయన పేర్కొన్నారు.

**క్లాక్‌టవర్ వద్ద కాంగ్రెస్ నిరసన..**

అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి పాదయాత్రగా కాంగ్రెస్ శ్రేణులు క్లాక్‌టవర్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ నిరసన చేపట్టి కమలం పార్టీ దాడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డిపై వెంటనే పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు భారీగా మోహరించి, ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో నల్లగొండలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

సమయం
మంగళవారం 01 సెప్టెంబర్ 2026

# సంపాదకీయం

## ఆరుద్ర మహాసముద్రం

'కవిత కోసమె నేను పుట్టాను, క్రాంతి కోసం కలం పట్టాను" అన్న ఆరుద్ర పుట్టింది 1925 ఆగస్టు 31. ప్రయోగ వాదిగా, అంత్య ప్రాసల ముద్ర ఆరుద్రగా పలు ప్రక్రియా వైవిధ్య సంభరితుడుగా, సినిమా కవిగా తెలుగు సాహిత్యంలో ఆరుద్ర ప్రత్యేక స్థానాన్ని పదిలపరచుకొన్నాడు. "నీలాల నింగిలో ఎర్ర జెండా తోడ, విశ్వ వీణా రవపు విజయ గానమ్ముతో విజయ శంఖారావ విశ్వగీతమ్ముతో కొత్త మార్గాలపై, కొత్త మార్గాలకై కదలవే, కదలవే" అని బావుటా ఎగరేసి కవిత్వపు కాగడాను తన 17వ యేట 1942 లోనే పట్టి పురోగమించారు. ఆయన ఇంటరు మొదటి సంవత్సరం వరకే చదివారు. ఇంటరులో ఆయనకు ఇంగ్లీషు చెప్పిన గురువు రోణంకి అప్పలస్వామి. ఆరుద్ర తన 'త్వమేవాహం' కావ్యాన్ని వారికే అంకితమిచ్చారు. ఆరుద్ర 1948 జులై 10 తర్వాతే 'త్వమేవాహా'న్ని మొదలుపెట్టినప్పటికీ ప్రథమ ముద్రణ వెలువడింది జులై 1949. 'త్వమేవాహం' అప్పట్లో సంచలనం. నిజాముకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ పోరాటం నేపథ్యంగా రాయబడిన కావ్యమది. భాషలో ఆరుద్ర ప్రయోగాలు పాఠకులను అదిరిపాటుకు గురి చేశాయి. "బ్రెయిన్‌లో బ్రెన్ గన్, రెయిన్‌లా ఆలోచనల ట్రైన్, స్పయినల్ కార్డులో స్పెయిన్, గ్లూమీ తిమిరాలు చెరిషించి, సైతాను మనల్ని పరిషించునపుడు, నిర్వేదనా పవనాలు వర్షించు, బ్రెయిన్‌లో స్టెన్ గన్లా చెట్లా చిట్టెలుకలు, చెయిన్సులో మగవాళ్లు, చెరచబడ్డ ఆడవాళ్లు, స్నో తెలుపు, డ్యూతెలుపు" – ఇలా బుల్లెట్లలా పదాలు దూసుకొచ్చేసరికి ఆ ఇంగ్లీషు మాటల దూకుడు, ఆ ప్రతీకలు ఆనాటి పాఠకులకు కొరుకుడుపడక వింతగా చూశారు. ఆరుద్ర హృదయాంతర్గత వేదనను, మెదడులోని అలజడిని దాశరథి వివరించిన తరువాత కొంతమందికి అర్థమైంది. దాశరథి 'అగ్నిధార', సోమసుందర్ 'వజ్రాయుధం' రెండూ తెలంగాణా పోరాట నేపథ్యంలో 1949 లోనే వెలువడ్డాయి. "మేధాశోధన నాళికలో కాలాన్ని పోసి, మండుతున్న గుండెల మీద మరగ బెడతాను. మానవాళికి పనికి వచ్చే ఫలితాల కోసం పాటుపడతాను, పాటకడతాను, కాలాన్ని పట్టి తెచ్చి రాటకేసి కట్టేస్తాను. కాలాన్ని మీకు బానిసగా చేస్తాను. కళ్లల్లో జ్యోతులు వెలిగిస్తాను. భూతల స్వర్గానికి తలుపులు తీస్తా"నని తన ఆకాంక్షను కావ్యారంభంలోనే చెప్పారు. కావ్యంలో ప్రతీకల ప్రయోగం అద్భుతం. కాలానికి సంకేతం గడియారం. గడియారం మన సంఘం. ఇసుక గడియారం, నీటి గడియారాలు పాత కాలపు సంఘాలు. గంటలు శ్రీమంతులు. నిముషాలు మధ్యతరగతి వాళ్లు. సెకండ్లు శ్రామికులు. చిన్నముల్లు శ్రీమంతుల మనస్తత్వానికి సూచి. పెద్దముల్లు మిడిల్ క్లాసు వాళ్ల భావాలకు బరామీటరు. సెకండ్ల ముల్లు శ్రామిక జనుల ఫిలాసఫీకి కొలబద్ద. స్టాప్ వాచి విప్లవాన్ని టైం చేసే సాధనం. పెండ్యులం నిలకడలేని ఊగిసలాట మనస్తత్వానికి ప్రతీక. 'కీ' విప్లవానికి ప్రోద్బలకారణం. కాలాన్ని ప్రవాహంగా కూడా భావించారు ఆరుద్ర. మృత్యువుతో పోరాడే తెలంగాణా పౌరుల చైతన్యంతో కవి 'త్వమేవాహ'మన్నాడీ కావ్యంలో. అంటే నువ్వేనేనని అభేదాన్ని చెప్పాడు. "ఈమె అయస్కాంతకాంత" అనే ఖండికలో పన్నెండు పాదాలు పన్నెండు అంకెలకు గుర్తు. పాదానికి ఐదక్షరాలు. ఒక అంకె నుండి ఒక అంకెకు రావటానికి పట్టే ఐదు సెకండ్లకు సూచిక. మొత్తం అరవై అక్షరాలు. అరవై సెకండ్లకు సంకేతంగా నిలుస్తాయి. ఇది గడుసైన శిల్పం. ఆరుద్ర 'టెక్నిక్' లేని కవిత్వాన్ని ఊహించలేనన్నాడు. కెప్టెన్‌ను తండేల్ అనటం, విమానాన్ని గాలిగెద్ద అనటం, డ్రెడ్జర్‌ను తవ్వోడ అనటం లాంటి పద ప్రయోగాలు ఉన్నాయి. దీనిలోనే ఛందః ప్రయోగాలూ ఉన్నాయి. వచన కవితలా సాగిస్తూ ఇది పద్యమే అని అనుమానం రాకుండా మత్తకోకిల, ఉత్సాహం, కవిరాజ విరాజితం, పృథ్వీవృత్తం, తరలం, మందారదామం, లయగ్రాహి, దండకం, కందం లాంటివి పద్యాలు పేర్లు పెట్టకుండా రాశారు. కుందుర్తి 'నగరంలో వాన'లో కూడా ఇలా ఛందః ప్రయోగాలు చేశాడు. వచన కవిత్వమనే అభిప్రాయాన్ని కలిగించారు. ఛందస్సుల రహస్యం తెలిసిన వారే అలా రాయగలరు. "ప్రజ భయపడకూడదు ఇల నిజం గెలుస్తుంది కనుక నీతి వెలుస్తుంది. జరామరణాలిక కల. ధ్వజం కొస నిరంతర సమధర్మం చూస్తాం". ఇది కందపద్యం – దీనిలోని సందేశంతోనే 'త్వమేవాహం' ముగుస్తుంది. నిర్దేశించిన భావాలను వాక్యాలు బట్వాడా చేయలేవనుకున్నప్పుడు, ఆంగ్ల పదబంధాలను ఉపయోగించటానికి ఆరుద్ర వెనకాడలేదు. ఈ విధానం, ఆరుద్ర మరొక కావ్యం 'సినీవాలి' లోనూ కొనసాగింది. 'సినీవాలి' అంటే అమావాస్య నాడు కనపడే నెలవంక. ఇది నాలుగేళ్ల కొకసారి మాత్రమే కనిపిస్తుంది. చీకటిలో వెలుగు రేఖ ఉన్నట్లే కష్టాల్లో కూడా ఆశారేఖ ఉంటుందనే అర్థంలో కవి ఈ పదాన్ని గ్రహించాడు. డిగ్రీ చదువుకున్న మధ్యతరగతి యువకుడు సూర్యారావు ఉద్యోగాన్వేషణకు పట్టణానికి వెళ్తాడు. క్లర్కు ఉద్యోగం వస్తుంది. నగరంలో గుమస్తా బతుకు బాధలను నగర జీవనాన్ని ఈ కావ్యంలో ఆరుద్ర చిత్రించారు. పఠాభి 'ఫిడేలు రాగాల డజన్' కావ్యంలో నగర జీవన చిత్రణ ఆరుద్రకు స్ఫూర్తి. ఇందులో నాయకుడు మధ్యతరగతి యువకుడు. కలలబేరగాడు. ఇతడేమంటాడంటే–"దావానలతుల్యోజ్వల భావానల కీలలోన పడుతూ ఉంటా, భావాలకు బానిసనై కావాలని గాలిమేడ కడుతూ ఉంటా"నంటాడు. ఇది కంద పద్యం. ఇలా ఆరుద్ర ఛందః ప్రయోగాలు చాలా ఉన్నాయి. 'సినీవాలి' కావ్యంలో నాటకీయత ఉంది. పాత్రలు సూర్యారావు, తండ్రి, ముగ్గురు వధువులు, కవి. సూర్యారావు, ఆ యువతులతో జరిపిన సంభాషణలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. తండ్రి: "అబ్బాయీ! నీ చీకటి బ్రతుకులో పెళ్ళామనే పెట్రోమాక్సు లైట్ కావాలి. జీవితం రేడియో సెట్టుకి భర్త ఏరియల్, భార్య ఎర్త్" అంటాడు. "భార్యభర్తలనే ఏరియల్సు, ఎర్తు ఉన్నా ఏకాభిప్రాయమనే విద్యుచ్ఛక్తి లేకపోతే సెట్టు పలకటం సున్నా" అని అంటాడు అబ్బాయి. పాత్రల సంభాషణలు చమత్కారవంతంగా ఉంటాయి. పాత్రల ప్రవేశానికి మధ్య కవి వ్యాఖ్యానం ద్విపదల్లో ఉంది. "ఆర్జించుకొన్నట్టి ఆవేదనాగ్ని బూర్జువా సరదాల బూజు ధరించ" ఇలా కావ్యం మొత్తం మీద 61 ద్విపదలను రాశారు. అది ఆరుద్ర ప్రత్యేకత, జీవఫలం ప్రేమ -- అనేది ఈ కావ్యసందేశం -- కొంతమంది అనుకున్నట్లుగా ఈ కావ్యం విషాదాంతం కాదు. "అయ్యా! మృత్యువుగారూ! పిల్లవాణ్ణి దయచేసి కనికరించండి. లేమి కారుతోంది చూడండి. కలల పంచ నుండి కారే సంతృప్తి ధార, నిద్దుర బిందెలలో పట్టుకోనీయండి" – అన్న వాక్యాలతో కావ్యం ముగుస్తుంది. ఆరుద్ర 'కూనలమ్మ పదాలు'కు ఎన్నో అనుకరణలు వచ్చాయి. జనం నాలుకల మీద నాట్యమాడేవి చాలా ఉన్నాయి. "ఆశ పెరిగిననాడు, అహం పెరిగినవాడు తనకు తానే కీడు ఓ కూనలమ్మా! బ్రూటుకేసిన ఓటు, బురదలో గిరవాటు, కడకు తెచ్చును చేటు – ఓ కూనలమ్మా! సగము క్యాపిటలిస్టు, సగము కమ్యూనిష్టు, ఎందు కొచ్చిన రొష్టు – ఓ కూనలమ్మా!" అన్నారు. కవిత్వపరంగా ఇవికాక – 'ఆరుద్ర రచన' (కవితలు) 1985 సంకలనం. విశాఖపట్నంపై 1942లో బాంబులు పడినప్పుడు 'మరణశాసనం' కవితలో, "కాలంకాగితమ్మై/ దివాకరుడు స్టాంపయితే/ నా దస్తావేజు మీద/ రేరాజే రాజముద్ర" అంటారు. ఆయన నాట్యశాస్త్రంపై రాసిన 'హస్తలక్షణ పదాలు' విశిష్టమైన రచన. ఇందులో భరత నాట్యంలో ముద్రలకు సంబంధించినవి ఆరుద్ర 31 హస్తలక్షణపదాలను చెప్పారు. వీటిలో ఆరుద్రముద్ర 'బాలగోపాల" అన్నది. నన్నయ్య, విశ్వనాథల మధ్యాక్కరలకంటే భిన్నంగా మంచి గమకంతో ఉండేట్లు మార్పు చేసి రాశారు ఆరుద్ర. వారు సవరించిన విశేషం వారి మాటల్లోనే: "భగణమ్ముపై నొక్క లఘువుపాదుకొలుపును మంచి బిగువు (భల–చంద్రగణం)/ నగణమ్ములఘువులను రెండు నడకకై చేర్చుకొననిండు (నలల–చంద్రగణం)/ సొగసుగా ఇంద్రగణమందు చొప్పించుకో మాత్ర లైదు/ చిగురించ శుభలక్షణాలు చెప్పరా మధ్యాక్కరాలు" – ఇదీ వారి మార్పు. ఇది వారి ప్రయోగం. భార్య రామలక్ష్మి మీద 'కే.రా త్రిశతి' పేరుతో మూడువందల కంద పద్యాలను రాశారు. నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ అయినప్పుడు ఆరుద్ర ఐసియు బెడ్ మీద పడుకొనే వీటిని రాశారు.

# అభివృద్ధి పనులపై మంత్రి జూపల్లి సమీక్ష

కొల్లాపూర్ : వీపనగండ్ల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పనుల పురోగతి, పెండింగ్ సమస్యలు, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు..వీపనగండ్ల మండలానికి 375 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా ఇప్పటివరకు 321 మంది లబ్ధిదారులను గుర్తించారని, ఇంకా 54 మంది లబ్ధిదారుల ఎంపిక పెండింగ్‌లో ఉందని అధికారులు మంత్రికి వివరించారు. మొదటి విడత లబ్ధిదారుల ఎంపికే ఇంకా పూర్తికాకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీ సమావేశాలు నిర్వహించి, రెండు మూడు రోజుల్లోగా పెండింగ్ లో ఉన్న 54 మంది లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఆదేశించారు..ఎంపిక అనంతరం గెజిటెడ్ అధికారుల వెరిఫికేషన్, శాంక్షన్ ప్రక్రియను కూడా ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. మొదటి విడతలో లబ్ధిదారులను గుర్తించి శాంక్షన్ చేయకుండా ఇళ్లను పెండింగ్‌లో ఉంచినట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొరపాటుగా L3 జాబితాలో నమోదైన అర్హులైన లబ్ధిదారులను పంచాయతీ కార్యదర్శులు గుర్తించి సంబంధిత ఎంపీడీవోలకు వివరాలు అందించాలని మంత్రి సూచించారు. హౌసింగ్ లాగిన్‌లోని L3 to L1 Module ద్వారా అర్హులైన వారి ప్రతిపాదనలను వారం రోజుల్లోగా జిల్లా కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడే పరిష్కరించాలని సూచించారు. అనంతరం



గ్రామీణాభివృద్ధి, సాగునీటి పారుదల, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, హౌసింగ్, పంచాయతీ రాజ్ – గ్రామీణాభివృద్ధి, టీజీఎస్ఆర్టీసీ, ఐసీడీఎస్, దేవాదాయ, భూసేకరణ, రెవెన్యూ శాఖల పరిధిలోని అంశాలపై మంత్రి సమీక్షించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, సాగునీరు, రహదారులు, తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ఉజ్బెకిస్థాన్‌లో మార్మోగిన ప్రధాని కవిత.. అభీ తో సూరజ్ ఉగా హైను ఆలపించిన విద్యార్థులు..

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ ఉజ్బెకిస్థాన్ పర్యటనలో రాజకీయ, దౌత్య అంశాలతో పాటు ఒక ప్రత్యేక సాంస్కృతిక ఘట్టం కూడా చోటు చేసుకుంది. మోదీ స్వయంగా రచించిన 'అభీ తో సూరజ్ ఉగా హై' కవితను ఉజ్బెక్ విద్యార్థులు హిందీ, ఉజ్బెక్ భాషల్లో ఆలపించారు. ఈ కార్యక్రమానికి మోదీ కూడా హాజరయ్యారు. ఉదయించే సూర్యుడిని కొత్త ప్రారంభానికి ప్రతీకగా అన్వయిస్తూ 'అభీ తో సూరజ్ ఉగా హై' కవితను ప్రధాని రాశారు. ప్రధాని మోదీ రచించిన మూడు కవితలను తాష్కెంట్‌లోని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియెంటల్ స్టడీస్‌లో విద్యార్థులు ఆలపించారు. ప్రతి కవితను హిందీతో పాటు ఉజ్బెక్ అనువాదంలోనూ వినిపించారు. ఈ ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ తాష్కెంట్‌లోని కుక్సారోయ్ ప్యాలెస్‌లో మోదీ కోసం ఏర్పాటు చేసిన అనధికారిక విందులో కూడా 'అభీ తో సూరజ్ ఉగా హై' ఆధారంగా ప్రత్యేక సంగీత ప్రదర్శన నిర్వహించారు. మోదీ, మిర్జియోయెవ్ కలిసి ఈ ప్రదర్శనను వీక్షించారు. కార్యక్రమంలో కవితకు సంబంధించిన హిందీ పదాలను స్క్రీన్‌పై ప్రదర్శించారు
తన కవితలను ఉజ్బెక్ విద్యార్థులు హిందీలో పఠించడం మోదీని భావోద్వేగానికి గురిచేసింది. చాలా కాలం క్రితం తాను రాసిన కవితలను ఇప్పుడు యువ విద్యార్థుల నోట వినడం ప్రత్యేక అనుభూతిని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. హిందీ వారి మాతృభాష కాకపోయినప్పటికీ, కవితల్లోని భావాలను విద్యార్థులు తాను రాసినప్పుడు అనుభవించినట్టుగానే వ్యక్తీకరించారని మోదీ అన్నారు. ఒక భాషను పూర్తిగా నేర్చుకుని, దానిలో మమేకమైనప్పుడే అలాంటి భావవ్యక్తీకరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడు మహేంద్ర భట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

చిన్నచింతకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

(సమయం ప్రతినిధి దేవరకద్ర) చిన్నచింతకుంట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పి. నాగరాజు ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు శ్రీ మహేంద్ర భట్పై ఫిర్యాదు చేయడం జరిగింది. హల్ద్వానీలో మల్లికార్జున్ ఖర్గే సభ అనంతరం నిర్వహించినట్లు పేర్కొన్న శుద్ధీకరణ కార్యక్రమాన్ని సమర్థించిన మహేంద్ర భట్‌తో పాటు, ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారిపై SC/ST చట్టం మరియు వర్తించే ఇతర చట్టాల కింద విచారణ జరిపి, చట్టప్రకారం FIR నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఏ చర్యనైనా సహించేది లేదు. రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. దళితుల గౌరవం, రాజ్యాంగ హక్కులు, సామాజిక సమానత్వ పరిరక్షణ కోసం ఈ ఫిర్యాదు సమర్పించినట్లు నాయకులు తెలిపారు. దళితుల ఆత్మగౌరవం కోసం పోరాటం కొనసాగుతుంది పిలుపునిచ్చారు
జి.ప్రతాప్, జి. ఫీలోగు



యం.యాకోబు (1వ వార్డు మెంబర్)
L.M. రాజు, జయరాజు, తిమోతి, యెసేపు, సురేష్, వద్దే మాన్ సుమన్, రవితేజ పాల్గొన్నారు

# విద్యారంగానికి సరోజ సేవలు అభినందనీయం : మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



వనపర్తి : ప్రభుత్వ జూనియర్ కళాశాల 26 సంవత్సరముల తెలుగు అధ్యాపక వృత్తిలో సమర్థవంతంగా బాధ్యతను నిర్వర్తించి పదవీ విరమణ కాబోతున్న సరోజ తెలుగు లెక్చరర్ సందర్భంగా లిమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సరోజ 2000 సంవత్సరంలో కాంట్రాక్టు పద్ధతిన అధ్యాపకురాలిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి మిడ్జిల్ ఆమనగల్లు గోపాల్పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వనపర్తిలోని మహిళా జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా వృత్తిని పదవీ విరమణ చెంధడం ఈ సందర్భంగా వారికి సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా తరుపున శుభకాంక్షలు తెలియజేస్తున్నాను అన్నారు. ఒకవైపు నలుగురు కుమార్తెలను ఉన్నత విద్యావంతులుగా బాల్యము నుండి క్రమశిక్షణగా తీర్చిదిద్దుతూ అదే స్థాయిలో తను పాఠాలు చెప్పే విద్యార్థులను కూడా విద్యావంతులుగా వాళ్ల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తూ తను పనిచేసిన ప్రతి కళాశాలలో ప్రధాన అధ్యాపకుల సూచనలు సలహాలు గౌరవంగా పాటిస్తూ తోటి అధ్యాపకులతో ఆత్మీయంగా ప్రేమపూరితంగా మెలుగుతూ సహాధ్యాపకులకు విద్యార్థులకు అభిమాన పాత్రురాలిగా అందరితో సమన్వయంగా కలుపుగోలుగా ఉంటారు సరోజ అన్నారు. నిరంతరం సాహిత్య అధ్యయనం చేస్తూ వివిధ కవి సమ్మేళనములలో పాల్గొని సన్మానాలు సత్కారాలు పొందారు ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వనపర్తి జిల్లా ఉత్తమ కవయిత్రిగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలలో ఆ నాడు నేను మంత్రి గా ఉన్నపుడు నా చేత సన్మానింపబడ్డారు అన్నారు. వారి తదుపరి జీవితం కూడా సుఖవంతంగా విశేషంగా ఉండాలనీ కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో. వాకిటి శ్రీధర్, ప్రేమ్ నాథ్ రెడ్డి, శంకర్ గౌడ్, చిట్యాల రాము, హలీమ్, లక్ష్మణ్ గౌడ్, శివ గౌడ్ తధితరులు పాలుగొన్నారు.

# ఎమర్జెన్సీ చరిత్రకు సాహిత్యఆర్కైవ్స్ 'చీకటి రోజులు'

సమయం ప్రతినిధి : దేశంలో ప్రకటిత ఎమర్జెన్సీకి యాభై ఏళ్లు. నాటి భయద వాతావరణాన్ని చిత్రిస్తూ దేశవ్యాప్తంగా తర్వాత ఎన్నో రచనలు, సినిమాలు వచ్చాయి. వాటిలో తొలి సృజనాత్మక రచన అంపశయ్య నవీన్ 'చీకటి రోజులు'. నాటి దురాగతాలు అనేక రూపాల్లో నేడు పునరావృతమౌతున్న సందర్భంలో ఆ నవల ఇంగ్లీష్ అనువాదాన్ని 'డైరీ ఆఫ్ యాన్ అన్‌సీన్ విట్‌నెస్' పేరుతో 'స్పీకింగ్ టైగర్ బుక్స్' ఇంగ్లీష్‌లో ప్రచురించింది. ఆ సందర్భంలో పుస్తకం అనువాదకురాలు కల్పనా కన్నబిరాన్‌తో సంభాషణ: రాజ్యహింస, ఆధిపత్యాల కింద నలిగే మనిషి దుస్థితి చుట్టూ, జీవన వేదన చుట్టూ తిరిగే సృజనాత్మక రచనలపైన నాకు మొదట్నుంచీ ఆసక్తి. వ్యవస్థీకృత అవినీతి చుట్టూ ఉన్న సృజనాత్మక రచనల్ని గతంలో అధ్యయనం కూడా చేశాను. నేను సాహిత్య విద్యార్థిని కాదు – న్యాయశాస్త్రం, జ్యూరిస్‌లిటరేచర్స్ దృష్టి కోణం నుంచి నేను సాహిత్యాన్ని చేరుకుంటాను. కోర్టు రూమ్‌లో వెలువడే తీర్పులు నాకు సాహిత్యం. న్యాయ పరిభాషలోని పదాలు, వాటి కనిపించే/ కనిపించని అర్థాలు, న్యాయం కోసం అక్కడ తచ్చాడే రక్త మాంసాలతో నిండిన ప్రజలు, వాళ్ళ భౌతిక మానసిక బాధలు, పౌరుల హక్కులపై స్వేచ్ఛపై తక్షణం చోటు చేసుకునే పరిణామాలు... వీటన్నిటికీ కోర్టు రూమ్ నిలువెత్తు సజీవ రూపం అని నేను భావిస్తాను. దీనితో పాటు, సామాజిక విప్లవోద్యమాల్లో పనిచేసినవారి కోసం న్యాయకోవిదుడిగా మా నాన్నగారు తన జీవితకాలంలో చేసిన వాదోపవాదాల నుంచి, రాజ్యాంగ విలువల పట్ల ఆయన చూపిన నిబద్ధత నుంచి లభించిన ఎరుక నాకు ఉండనే ఉంది. కోర్టు గదుల్లో వినిపించిన ఆధిపత్య వ్యతిరేక ప్రతిఘటన స్వరాల సాహిత్యం సైతం నాకు ఆయన్నుంచి అందివచ్చింది. ఈ మేధోపరమైన రాజకీయ నిమగ్నతే నన్ను నవీన్ 'చీకటి రోజులు' నవల వైపు చూసేలా చేసింది. కోర్టు కేసులకు సంబంధించిన ఆర్కైవ్‌లు మనకు ఒక విలువైన కథనాన్ని అందిస్తాయి. అయితే సాహిత్య ఆర్కైవ్ మన కోసం ఈ చరిత్రను ఒక ప్రత్యేకమైన రీతిలో మరింత విస్తృతంగా ఆవిష్కరిస్తుంది. నా దృష్టిలో సాహిత్య ఆర్కైవ్‌లో 'చీకటి రోజులు'కు ఉన్న ప్రత్యేక స్థానం ఇదే. ఈ నవల్లో ప్రతి వ్యక్తి కథకూ కేంద్రంలో న్యాయం అనే ఒక భావన, అలాగే సాధారణ ప్రజల ఆకాంక్షలకు జరిగిన ద్రోహంపై అంతర్లీనంగా రగులుతున్న ఆగ్రహం ఉన్నాయి. అసాధారణమైన వీరోచిత సంఘటనలకు, 'తిరుగుబాటు' సందర్భాలకూ మాత్రమే పరిమితం కాకుండా, వాటికి బయట ఆ ప్రమేయాలకు అతీతంగా ఎటువంటి ప్రత్యేకతలూ లేని అతి సాధారణ జీవితాలపై రాజ్యం అమలుజేసే అణచివేత ఎంత క్రూరంగా ఉంటుందో దాని యంత్రాంగం ఎలా పనిచేస్తుందో ఈ రచన చూపిస్తుంది.

# ప్రజాపాలనలో 1000 రోజులు.. తెలంగాణ ప్రగతికి కొత్త దిశ-మంత్రి వాకిటి శ్రీహరి

### తెలంగాణ అభివృద్ధి నమూనా దేశానికి దిక్సూచిగా నిలుస్తుంది-మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, తెలంగాణ ప్రజలకు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 1000 రోజుల్లో రైతు సంక్షేమం, పేదల భరోసా, యువతకు ఉద్యోగాలు, విద్య, సామాజిక న్యాయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రైతు భరోసా పెంపు, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి నిర్ణయాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయన్నారు. బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. 1000 రోజులు ఒక మైలురాయి మాత్రమేనని.. ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో మరింత వేగంగా పనిచేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

# సంచార జాతుల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి సారించాలి

## కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 31:** సంచార జాతుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబనతో పాటు సామాజికంగా గౌరవప్రదమైన జీవనం సాగించేలా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సంచార జాతుల 75వ విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి చేన్నయ్య తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... సంచార, విముక్త జాతుల చరిత్రను, వారు ఎదుర్కొన్న సామాజిక పరిస్థితులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, గతంలో వివిధ కారణాలతో సామాజికంగా వెనుకబడిన ఈ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా వారి పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. పథకాల ప్రయోజనాలు పొందడంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. సంచార జాతుల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, సమాన గౌరవం లభించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. సంచార, విముక్త జాతుల సంక్షేమం కోసం అధికారులు, కుల సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, బీసీ సంఘాల ప్రతినిధులు, సంచార జాతుల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# అమరచింత నియోజకవర్గంను తిరిగి ఏర్పాటు చేయించాలి

## కేంద్ర మంత్రికి అమరచింత డెవలప్మెంట్ కమిటీ వినతిపత్రం

అమరచింత : డిలీమిటేషన్ ప్రక్రియలో అమరచింతను తిరిగి నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలనీ కోరుతూ కేంద్రమంత్రికి అమరచింత నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సోమ వారం నాడు వినతి పత్రం సమర్పించింది.గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజకవర్గ పర్యటనను ముగించుకుని జూరాల ప్రాజెక్టు మీదుగా అమర్చిత నుండి వెళుతున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డికి అమరచింత డెవలప్మెంట్ ఫోరమ్ తరపున వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో వనపర్తి జిల్లాలో ప్రస్తుతం మండలము మరియు మున్సిపాలిటీ కేంద్రంగా కొనసాగుతున్న అమరచింత ప్రాంతం గతంలో సంస్థానంగా, నియోజకవర్గంగా కొనసాగిందని చెప్పారు. అమరచింత పురాతనమైన పట్టణం. క్రీ.శ. 973 నుండి క్రీ.శ. 1200 వరకు కళ్యాణి చాళుక్యుల ఏలుబడిలో కొనసాగింది అని చెప్పడానికి...ఆ పాలనా కాలంలో వారు వేయించిన పెద కడుమూరు శాసనం ద్వారా అమరచింత ఉనికి గురించి తెలుస్తున్నది.. ఇలా కళ్యాణి చాళుక్యుల పరిపాలన నుండి మొదలై దాదాపుగా 1100 ఏండ్ల చారిత్రక నేపథ్యం కలిగిన ప్రాంతం అమరచింత.క్రీ.శ.12 శతాబ్దం కాకతీయుల కాలంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న మొత్తం ఐదు సంస్థానాలలో అమరచింత సంస్థానం ఒకటిగా ఉండి క్రీ.శ 1268 నుండి 1278 వరకు సంస్థానానికి మూలపురుషుడిగా గోపాల్ రెడ్డి నుండి మొదలైన అమరచింత సంస్థానం.క్రీ.శ.1680లో చెన్నారెడ్డి రాజు పాలనలో అమరచింతలో కోట నిర్మాణము చేశారు.. ఈ విధంగా 1948 వరకు అమరచింత సంస్థానాన్ని దాదాపు 26 మంది రాజులు పాలించడం జరిగినది. తర్వాత కాలంలో అమరచింత నియోజకవర్గ కేంద్రంగా



ఉండి 1952 నుండి 2009 వరకు దాదాపు 57 సంవత్సరాలుగా ఎందరో శాసనసభ్యులను అందించిన ప్రాంతం ఈ అమరచింత. అమరచింత నియోజకవర్గం 2009లో నియోజకవర్గ డిలిమిటేషన్ /నియోజకవర్గ పునర్ వ్యవస్థీకరణలో బాగంగా మా ప్రాంతం నియోజకవర్గాన్ని కోల్పోవడం జరిగినది. ఇంత చరిత్ర కలిగిన ఈ ప్రాంతం తన పూర్వవైభవాన్ని తమ నియోజకవర్గాన్ని తిరిగి దక్కించుకోవాలని ఈ ప్రాంత ప్రజలు ఆశిస్తున్నారు.కావునా రానున్న నియోజకవర్గం పునరవిభజనలో అమరచింతను తిరిగి నియోజకవర్గం కేంద్రంగా ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నాము. అమరచింత డెవలప్మెంట్ ఫోరమ్ మెంబర్స్ సత్యేందర్, వడ్డేటి అంజి, కోరి శ్రీనివాసులు, ప్రశాంత్, వగ్గు సందీప్ ,మేర్వ శ్రీన్నూ విష్ణు, రఘు మొదలైన వారూ పాల్గొన్నారు.

# కోయిల్ సాగర్ పంప్ హౌస్ నుండి అమరచింత పరిసర చెరువులు కుంటలకు సాగు నీరు విడుదల చేయాలి

## కోయిల్ సాగర్ పంప్ హౌస్ ను సందర్శించిన రైతులు,వివిధ రాజకీయ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు



సమయం (ప్రతినిధి – అమరచింత) : కోయిల్ సాగర్ లిఫ్టు పంప్ హౌస్ నుండి ఉంద్యాల చెరువుల మీదుగా అమరచింత పెద్ద చెరువుకు, అమరచింత పరిసర కుంటలకు కోయిల్ సాగర్ నీరు విడుదల చేయాలని అమరచింత రైతు సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీ, ప్రజాసంఘాలు నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. చిన్న చింతకుంట మండలం ఉంద్యాల శివారులోని కోయిల్ సార్ పంపు హౌస్ ను రైతులు రైతు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ అమరచింత పరిసర ప్రాంతాల సమీపంలో కృష్ణానది పారుతున్న రైతుల భూములకు మాత్రం సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉంద్యాల చెరువు మీదుగా అమరచింత పైన ఉన్న కాలువ ద్వారా అనాయికుంట. నాగులకుంట లకు కోయిల్ సాగర్ నీరు రావడానికి అవకాశాలు ఉన్నాయని కనుక ప్రభుత్వం నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వ్యవసాయ పొలాలకు నీళ్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కుంటలకు నీటిని విడుదల చేయడం వలన ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా పెంపొందుతాయని బృందం పేర్కొంది. ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ రవి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నేత కె. లక్ష్మీనారాయణ, రైతులు కోందడ రెడ్డి,పి.ఆంజనేయులు, పి.రాఘవేంద్ర, పి.రఘు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవి కాంత్, మరియు రాజేశ్వర్ రెడ్డి, ఉప్పరి రంగన్న, చిన్న అంజి, చిన్నకురుమన్న, గద్దర్ శీను తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు

ఆత్మకూరు : వనపర్తి జిల్లా..ఆత్మకూర్ మున్సిపల్ కేంద్రంలోని సాధరన సమావేశాన్ని బిజెపి దీతీం కౌన్సిలర్లు బహిష్కరించారు. ఆత్మకూరు మున్సిపల్ అభివృద్ధికి ఏడు కోట్ల నిధులు శాంక్షన్ చేసి కాంగ్రెస్ కౌన్సిలర్లకు మాత్రమే నిధులు కేటాయించి బిజెపి దీ=ూ కౌన్సిలర్లకు నిధులు ఇవ్వకుండా మొండి చేయి చూపారని వారు మండిపడ్డారు.. కమిషనర్ బయటికి వచ్చి సమాధానం చెప్పడంతో కమిషనర్ డౌన్ డౌన్ అంటూ సమావేశం హాల్లోకి కౌన్సిలర్లు దూసుకుపోయారు.



# గోకుల్ నగర్‌లో ఘనంగా కమిటీ భవనం పూజా కార్యక్రమం

### స్థానిక ప్రజలకు అందుబాటులోకి రానున్న కమిటీ భవనం..
### సామాజిక కార్యక్రమాలకు వేదికగా ఉపయోగపడాలని ఆకాంక్ష

వేకువ సమయం ఆగస్టు 30 కీసర ప్రతినిధి మేడ్చల్ జిల్లా, కీసర మండలం.రాంపల్లి: నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి గోకుల్ నగర్ కాలనీలో కమిటీ భవనం నిర్మాణానికి సంబంధించిన పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేస్తున్న ఈ కమిటీ భవనం భవిష్యత్‌లో స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు. పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాగారం డివిజన్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి, బాలరాజు, దొడ్డి బాలనరసింహ,



ఓం ప్రకాష్ గౌడ్, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి, ప్రజల అవసరాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు కమిటీ భవనం కీలకంగా ఉపయోగపడుతుందని నాయకులు పేర్కొన్నారు. కాలనీలోని ప్రజలు ఒకే వేదికపై సమావేశమై సమస్యలను చర్చించుకోవడానికి, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అన్ని కాలనీల వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్, జనరల్ సెక్రటరీ ప్రవీణ్ రాజ్, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, గోకుల్ నగర్ కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు కాలనీ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీ ప్రజల ఐక్యత, సహకారంతో కమిటీ భవనం అభివృద్ధి చెంది అందరికీ అందుబాటులో ఉండాలని, భవిష్యత్‌లో విద్యా, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు వేదికగా మారాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు, కాలనీ ప్రతినిధులు, ప్రజలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# నల్లగొండ జిల్లా ఫోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు!

దేవరకొండ: డిండి: ఆగస్టు 31 (సమయం ప్రతినిధి) పోక్సో కేసు నిందితుడికి 10 ఏళ్ల జైలుశిక్ష.. జరిమానా 7 లక్షల పరిహారం... ఏళ్ల తరబడి కొనసాగిన కేసు విచారణకు న్యాయస్థానం తీర్పుతో ముగింపు.! 2020 సెప్టెంబర్ 8న డిండి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికకు సంబంధించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.. ఆ రోజు జరిగిన ఘటనతో మొదలైన పోలీసుల దర్యాప్తు చివరకు నిందితుడికి శిక్ష పడే వరకు సాగింది.. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ ఐ ఆర్. నంబర్ 97/2020 నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో ప్రతాప్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మూడవత్ మల్లేష్‌పై ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. కేసు దర్యాప్తులో పోలీసు అధికారులు కీలక ఆధారాలను సేకరించి నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేశారు. సెషన్స్ కేసు నంబర్ 101/2021గా విచారణ కొనసాగింది. కోర్టులో ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన నల్లగొండ జిల్లా POCSO న్యాయస్థానం నిందితుడు మూడవత్ మల్లేష్‌కు 10 ఏళ్ల కారాగార శిక్ష విధించింది. అదే సమయంలో రూ.5 వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం ప్రకటించింది. ఈ కేసు దర్యాప్తులో అప్పటి ఎస్ హెచ్ ఓ .ఎం రాములు, అప్పటి .సీఐ. డి వెంకటేశ్వర్లు, ప్రస్తుత .ఎస్ హెచ్ ఓ. సిహెచ్ బాలకృష్ణ, ప్రస్తుత. సి ఐ. కే బీసన్న, సి డి ఓ .పి లింగయ్య, భరోసా లీగల్ ఆఫీసర్ మామిడి కల్పన తదితరులు సహకరించారు.

# తిమ్మాపురం పాఠశాలకు కంప్యూటర్ మరియు సౌండ్ సిస్టమ్ బహుకరణ



దేవరకొండ: నేరడుగొమ్ము: ఆగస్టు 31 : నేరేడుగొమ్ము మండలం ఎంపీ యుపి ఎస్ తిమ్మాపురం పాఠశాల కు ఈరోజు తిమ్మాపురం గ్రామానికి చెందిన ఇప్ప శ్రీకాంత్ రెడ్డి వారి తండ్రి జ్ఞాపకార్థం కంప్యూటర్ సిస్టమ్ ను , మరియు ఇప్ప నవీన్ రెడ్డి . పాఠశాల కు సౌండ్ సిస్టమ్ ను బహుకరించడం జరిగింది. పాఠశాల అభివృద్ధి లో గ్రామ ప్రజలు దాతలు గా ముందుకి రావడం చాలా సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయులు రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# జ్ఞానమాల కార్యక్రమానికి విశేష స్పందన

వేకువ సమయం కీసర ప్రతినిధి కీసర: కీసర మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారాంతపు జ్ఞానమాల కార్యక్రమం 238వ వారానికి చేరుకుని విజయవంతంగా కొనసాగింది. మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కర్రె గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఫ్లవర్ డెకరేషన్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్ఞానమాల కార్యక్రమం ద్వారా సభ్యులు, యువతలో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక చైతన్యం, సమానత్వం, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారానికి ఒకసారి క్రమం తప్పకుండా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సభ్యులను చైతన్యపరిచే దిశగా అంబేద్కర్ సంఘం చేస్తున్న కృషిని పలువురు అభినందించారు. ముఖ్య అతిథి రమేష్ మాట్లాడుతూ.. జ్ఞాన సముపార్జన ప్రతి ఒక్కరి జీవితంలో కీలకమని, సమాజ అభివృద్ధికి విద్యతో పాటు చైతన్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శి మంచాల మహేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిక్కుడు రమేష్ ముదిరాజ్, వడ్డరి కనకయ్య తదితరులు పాల్గొన్నారు. 238 వారాలుగా జ్ఞానమాల కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించడం పట్ల సంఘం సభ్యులు, పాల్గొన్న వారు హర్షం వ్యక్తం చేశారు.

# పేదల సొంతింటి కల సాకారం: ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో రామిడి స్వప్న విజయరెడ్డి

వేకువ సమయం ఆగష్టు 31 కీసర ప్రతినిధి : కీసర/చీర్యాల: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాల్లో కీసర డివిజన్-1కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయరెడ్డి పాల్గొన్నారు. కీసరదయారలో నక్క మమత జంగీర్, చీర్యాలలో పట్నం మొగులమ్మ లక్ష్మయ్య కుటుంబాల నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, నూతన గృహాల్లో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్వప్న విజయరెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతోమందికి భరోసాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల విజయవంతానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.







# అలంపూర్ ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు

**సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల జిల్లా :** కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి సోమవారం అలంపూర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రి హరిత హోటల్లో బస చేసిన కేంద్ర మంత్రి ఉదయం మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి మొదట బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో, మేళతాళాలతో ముఖ్య అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. మొదట వినాయకుని పూజల్లో పాల్గొన్న అతిథులు తర్వాత స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో కేంద్ర మంత్రి ఇతర అతిథులతో కలిసి మొక్కను నాటారు. ఆలయ అధికారులు, పూజారులు అతిథులకు స్వామి,అమ్మవారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ అధికారులు క్షేత్ర విశిష్టతను అతిథులకు వివరించారు. ఆలయం నుంచి తిరిగి హరిత హోటల్ కు చేరుకున్న అతిథులకు జిల్లాకు చెందిన పలు రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు, పలువురు రైతులు, ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని



పేర్కొన్నారు. అక్కడి నుంచి జోగులాంబ రైల్వే స్టేషన్ కు బయలుదేరే ముందు మంత్రి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఎండి గౌతమి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ శ్రీనివాసరాజు, ఈవో పురంధర్, అదనపు కలెక్టర్ మధుమోహన్, అదనపు ఎస్పీ శంకర్, ఆర్డీవో శ్రీనివాసరావు,



భాజపా రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పలువురు నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు బంద్.. ఆటోలే దిక్కు!

### నాలుగు రోజులుగా బిజ్వారం విద్యార్థుల అవస్థలు.. గద్వాలకు ఆటోల్లో ప్రయాణం



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామానికి గత నాలుగు రోజులుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గద్వాల పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సమయానికి అందుబాటులో లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు సమయానికి బస్సు రాకపోవడంతో ఆటోల్లో గద్వాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆటో ఛార్జీల భారం పడటంతో పాటు, ఎక్కువ మంది విద్యార్థులు ఒకే వాహనంలో ప్రయాణించాల్సి వస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా బిజ్వారం గ్రామానికి బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించి, ఉదయం వేళల్లో నిర్ణీత సమయానికి బస్సు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## దాసరిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌ల పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ వెంకటేష్



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం దాసరిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ పూజారి వెంకటేష్ గారి చేతుల మీదుగా స్కూల్ యూనిఫామ్‌లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి భవిష్యత్తుకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. గ్రామ సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ రామంతపూర్ కొండ విద్యార్థులు పాఠశాలకు రావాలి పాఠశాలలో డ్రాప్ లేనట్టుగా చూడాలని ప్రధాన ఉపాధ్యాయులకు సూచించిన గ్రామ సర్పంచ్.

## రాఖీ పండుగ పేరుతో ఆర్టీసీ దోపిడీ

### బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ



దేవరకొండ: ఆగస్టు 31 (సమయం ప్రతినిధి) : రాఖీ పండుగ పేరుతో తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులపై అదనపు భారం మోపుతూ దోపిడీకి పాల్పడుతోందని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ఆరోపించారు. హైదరాబాద్ నుంచి దేవరకొండకు సాధారణ బస్సు ఛార్జీ రూ.150 ఉండగా, రాఖీ పండుగ సందర్భంగా 'స్పెషల్ బస్' పేరుతో రూ.220కు పెంచడం దారుణమన్నారు.ఈ సందర్భంగా బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ.. పండుగల సమయంలో ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఆర్టీసీ ఛార్జీలను పెంచడం సరికాదన్నారు. ఒకవైపు పేద ప్రజలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ, మరోవైపు ఇతర మార్గాల్లో ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపుతోందని విమర్శించారు.రాఖీ పండుగ ముగిసి రెండు రోజులు గడిచినప్పటికీ 'స్పెషల్ బస్' పేరుతో అధిక ఛార్జీలు వసూలు చేయడం దారుణమన్నారు. వెంటనే అధిక ఛార్జీల వసూళ్లను నిలిపివేసి, ప్రయాణికులపై జరుగుతున్న ఆర్టీసీ దోపిడీని అరికట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కీసరలో మట్టి అక్రమ రవాణాపై రెవెన్యూ కొరడా

**ఆకస్మిక తనిఖీల్లో రెండు లారీలు సీజ్.. అక్రమ తవ్వకాలపై నిఘా**

వేకువ సమయం ఆగస్టు 30 కీసర ప్రతినిధి: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా : కీసర మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు, అనుమతులు లేకుండా మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మండల పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు గుర్తించిన రెండు లారీలను అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తున్న వాహనాలపై అధికారులు చర్యలు తీసుకోవడంతో అక్రమ మట్టి తరలింపుదారుల్లో కలకలం రేగింది.మండలంలోని పలు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలను గుర్తించి, అక్రమ తవ్వకాలపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

కేవలం మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయడంతో చర్యలు పరిమితం కాకుండా, అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తులు, వాహన యజమానులు, నిర్వాహకులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, ఇతర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరిగితే వాటిని కూడా పరిశీలించాలని కోరుతున్నారు.



**అధికారుల స్పందనపై ఆసక్తి**

సీజ్ చేసిన రెండు లారీలపై ఎలాంటి కేసులు నమోదు చేశారు? జరిమానా విధించారా? మట్టి ఎక్కడి నుంచి తవ్వి తరలిస్తున్నారు? తవ్వకాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఉన్నాయి? అనే అంశాలపై రెవెన్యూ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ శాఖ ఆకస్మిక తనిఖీలను కొనసాగిస్తుందా, అక్రమ తవ్వకాలపై కూడా విస్తృత స్థాయిలో చర్యలు చేపడుతుందా అనే దానిపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. తాజా సీజ్ చర్యలు అక్రమ మట్టి రవాణాకు ఎంతవరకు అడ్డుకట్ట వేస్తాయో చూడాలి.

# సాయి సంజీవ నగర్‌లో విక్టరీ షోటోకాన్ కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభం



వేకువ సమయం ఆగస్టు 30 కీసర ప్రతినిధి : నాగారం: సాయి సంజీవ నగర్ కాలనీ కమిటీ హాల్‌లో ఆదివారం విక్టరీ షోటోకాన్ కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు కరాటే శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభ కార్యక్రమానికి నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, నాగారం మాజీ వార్డు కౌన్సిలర్ పంగ హరిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టెక్–డైరెక్టర్, చీఫ్ ఎగ్జామినర్ ఇండియా ఆర్. మల్లికార్జున గౌడ్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు విద్యతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు కూడా అవసరమని తెలిపారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ ద్వారా పిల్లల్లో ధైర్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం మెరుగుపడతాయని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఇలాంటి శిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాయి సంజీవ నగర్ కాలనీ ప్రెసిడెంట్ ఎన్. విజయ్, కరాటే మాస్టర్ మోహన్ నాయక్, లక్ష్మీ ప్రసాద్, రవి, రమేష్, ప్రశాంత్, చందన్ కుమార్, నాగరాజు, శిరీష, సంతోషి తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభాన్ని స్వాగతించారు. సాయి సంజీవ నగర్‌లో కరాటే శిక్షణ కేంద్రం ఏర్పాటు కావడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పిల్లలు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కరాటేలో నైపుణ్యం సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీరామలింగేశ్వర స్వామివారి పల్లకి సేవ

వేకువ సమయం ఆగస్టు 31 కీసర ప్రతినిధి : కీసరగుట్ట: శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ భవాని శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామివారి పల్లకి సేవ ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ దంపతులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకి సేవ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# నిజాయితీ, విధి నిబద్ధతకు చిరునామాగా నిలిచిన ఏఎస్ఐ వెంకటేశ్వర్లు గౌడ్ కి ఘన వీడ్కోలు పలికిన ఎస్పీ



**కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్సై స్థాయికి ఎదిగిన వెంకటేశ్వర్లు గౌడ్ ప్రయాణం యువ పోలీసులకు స్ఫూర్తిదాయకం**
**విశ్రాంతి జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్ష**
**బెనిఫిట్స్ త్వరితగతిన అందజేయాలని అధికారులకు ఆదేశాలు**

వనపర్తి : ప్రజాసేవను పరమావధిగా భావిస్తూ, క్రమశిక్షణను జీవిత సూత్రంగా చేసుకుని, పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించిన వనపర్తి రూరల్ పోలీస్టేషన్ ఏఎస్సై, వెంకటేశ్వర్లు గౌడ్, కి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఘనంగా వీడ్కోలు పలికారు. సోమవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎస్పీ వనపర్తి రూరల్ ఏ ఎస్సై, వెంకటేశ్వర్లు గౌడ్ వారి సతీమణి ని , పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేసి వారి విశిష్ట సేవలను కొనియాడారు. విధి ముగిసినా... సేవల స్ఫూర్తి చిరస్థాయిగా నిలుస్తాయని వెంకటేశ్వర్లు గౌడ్ సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఉపాధి కాదు... అది సమాజ భద్రత కోసం చేసే త్యాగయాత్ర. అలాంటి యాత్రను అత్యంత నిజాయితీతో, నిబద్ధతతో కొనసాగించిన అధికారులు వనపర్తి రూరల్ పోలీస్టేషన్ ఏఎస్సై, వెంకటేశ్వర్లు గౌడ్ అని పేర్కొన్నారు. 1990లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా సేవలు ప్రారంభించిన వెంకటేశ్వర్లు గౌడ్, తమ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్సై హోదాను అందుకోవడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శమని అన్నారు. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ , గద్వాల్, వనపర్తి తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సైతం ధైర్యసాహసాలతో సేవలందించి, తన సర్వీసు కాలమంతా ఎటువంటి ప్రతికూల వ్యాఖ్యలు లేకుండా విధులు నిర్వర్తించడం ఆయన నిష్కళంక సేవలకు నిదర్శనమని కొనియాడారు. కష్టపడి పనిచేసే వారిని చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. వెంకటేశ్వర్లు గౌడ్ సేవలు శాఖకు గర్వకారణం. ఆయన చూపిన విధి నిబద్ధత, ప్రజల పట్ల మానవీయ దృక్పథం, సహోద్యోగులతో స్నేహపూర్వక వైఖరి యువతరం పోలీసులకు మార్గదర్శకంగా నిలుస్తాయి" అని ఎస్పీ పేర్కొన్నారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక కొత్త అధ్యాయమని, ఉద్యోగ బాధ్యతల నుంచి విముక్తి పొందిన అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించే జీపీఎఫ్, ఇన్సూరెన్స్, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పదవీ విరమణ అనంతరం అందాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలు, బకాయిలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, డిసిఆర్బి డిఎస్పీ,బాలాజీ నాయక్, పోలీసు కార్యాలయం ఏఓ, సునంద, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్ తదితర అధికారులు, పదవి విరమణ పొందుతున్న అధికారులు కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆదేశాలతో ప్రారంభమైన భూత్పూర్ కెనాల్ పూడిక తీత పనులు

అమరచింత : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన శాఖ, మంత్రివర్యులులి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా.తెలంగాణ రాష్ట్ర టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు. భూత్పూర్ లెఫ్ట్ కెనాల్ పరిధిలోని ధర్మపూర్, మస్తీపూర్, అమరచింత, పిన్నంచర్ల గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కెనాల్‌లో భారీగా జమ్ము, పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే హిటాచి ద్వారా పూడితను జమ్మును తొలగింపు పనులు ప్రారంభమైనవి.సంబంధిత అధికారులతో చర్చించి, కెనాల్‌లోని జమ్ము, పూడిక తొలగింపు పనులను అమరచింత కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ప్రారంభించారు.రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు.రైతుల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం... సాగునీరు ప్రతి పొలానికి చేరే వరకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో DCC వనపర్తి జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ , అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి , అమరచింత పట్టణ అధ్యక్షుడు టి రవి కాంత్ , అమరచింత మున్సిపాలిటీ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ , అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కమలాకర్ గౌడ్ , నాగల్ కదుమూరు గ్రామ సర్పంచ్ శివ , ధర్మపురం సర్పంచ్ సావిత్రమ్మ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మహిపాల్, ముని, రఫీ , నాగల్ కదుమూరు 10వ వార్డు నెంబర్ దామోదర్ , ధర్మాపురం 8వ వార్డు మెంబర్ చెన్నయ్య గారు, సాతర్ల అంజన్న గారు, కురువ బీరప్ప గారు, రామ్ రెడ్డి గారు, సత్యా రెడ్డి గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలు నిర్భయంగా ఎలాంటి పైరవీలు లేకుండా పోలీసు సేవలను వినియోగించుకోండి : జిల్లా ఎస్పీ





వనపర్తి, ఆగస్టు 31: వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా విని, చట్టపరంగా పరిష్కరించేందుకు సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకునేందుకు సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, సీఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్యల వివరాలను తెలుసుకుని, న్యాయబద్ధంగా పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. పైరవీలకు తావులేకుండా పోలీసు సేవలు ప్రజలకు భరోసా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలు చేయకుండా నేరుగా పోలీసులను సంప్రదించి తమ సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువగా ఉంటూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షించడమే జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి సమస్యలకు నేరుగా

**ప్రజావాణిలో 13 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీల స్వీకరణ**
**ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు**
**ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయడమే మా లక్ష్యం ఎస్పీ**

పరిష్కారం ప్రజల సమస్యలు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించి, వాటిపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం చూపేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజావాణిలో స్వీకరించిన 13 ఫిర్యాదుల వివరాలు:

03 – భూ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు

03 – భార్యాభర్తల మధ్య సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు

07 – పరస్పర గొడవకు సంబంధించిన ఫిర్యాదు ఉన్నాయని పిఆర్ఓ తెలిపారు.

# విద్య, వైద్యం, ప్రజా సమస్యలను పరిష్కరించాలి




**ప్రజా సమస్యల పరిష్కారం కోసం MRO కార్యాలయం ముట్టడి**

(సమయం ప్రతినిధి అమరచింత) : అమరచింత మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం మరియు వివిధ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో MRO కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి GS గోపి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి. వెంకటేష్,RN రమేష్,S.అజయ్, టీ.రాఘవేంద్ర మాట్లాడుతు అమరచింత మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల లేమి వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

అదేవిధంగా మండలంలోని ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరచాలని, DMR ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. మండలంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పెన్షన్లు, రేషన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర ప్రజా సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని కాలపరిమితితో కూడిన పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు అందాల్సిన విద్య, వైద్యం, మౌలిక వసతులు హక్కుగా అందే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తాం. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం 7వ వార్డు కౌన్సిలర్ మాధవి రాజేందర్,మండల నాయకులు రవి, బుచ్చన్న మాజీ సర్పంచ్ గోపాల్, శ్యాంసుందర్, అరుణ్, K శ్రీను, శంకర్, చంటి,k. అంజి,p.విష్ణు హరీష్, రాములు,కర్ణ, పాల్గొన్నారు.

ప్రధాన డిమాండ్లు:

1. అమరచింత మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, మౌలిక వసతులు కల్పించాలి.
2. పాంరెడ్డి పల్లి నుంచి కస్తూర్బాగాంధీ స్కూల్ వరకు BT రోడ్డు నిర్మాణం చేయాలి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలి
3. DMR ఆసుపత్రిల్లో వైద్యులు, సిబ్బంది, అందుబాటులో ఉంచాలి.
4. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలి.
5. అర్హులైన ప్రతి ఒక్కరికీ బీడీ పింఛన్,వృద్ధాప్యం పెన్షన్లు,రేషన్ మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి.
6. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలి.
7. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించాలన్నారు.

# రైతులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే

**లోకసముద్రం కట్టను పరిశీలించిన ఎమ్మెల్యే – రైతుల సమస్యలపై ఆరా**



దేవరకద్ర: లోకసముద్రం కట్టను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) పరిశీలించారు. సాగునీటి అవసరాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులతో కలిసి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో ఆత్మీయంగా మమేకమైన ఎమ్మెల్యే వారితో కలిసి భోజనం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్ పాత్‌లు కబ్జా చేసుకో... దర్జాగా కిరాయిలు ఇచ్చుకో

**జిల్లా కేంద్రంలో పుట్ పాత్ దందా, స్థలాలు అక్రమించుకుని డబ్బాలు ఏర్పాటు**
**డబ్బాలను కిరాయిలు ఇస్తున్న వైనం, ఒక్కో డబ్బా నుంచి రూ.4-6వేల వరకు వసూల్**




సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మున్సిపాలిటి స్థలాలు, పుట్ పాత్ లు అక్రమించుకుని అక్రమ దందాకు తెరలేపారు. జిల్లా కలెక్టరేట్ సమీపంలో మున్సిపాలిటీకి చెందిన విలువైన స్థలాన్ని కొందరు అక్రమార్కులు కబ్జా చేసి, అందులో రేకుల డబ్బాలు ఏర్పాటు చేశారు. ఉపాధి కోసం వచ్చే చిన్న వ్యాపారులకు ఈ డబ్బాలను అద్దెలకు ఇస్తూ నెలకు భారీగా అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారు. అధికారుల కళ్ల ముందే ఈ అక్రమ వ్యాపారం సాగుతున్నా పట్టించుకోకపోవడం శోచనీయం.

?ఫుట్‌పాత్‌లు మరియు రహదారుల పక్కన ఉన్న స్థలాలు ఆక్రమణకు గురికావడంతో బాటసారులు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలినడకన వెళ్లేందుకు స్థలం లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి, పేదల వద్ద అద్దెలు వసూలు చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్. ఇటీవల కృష్ణవేణి చౌరస్తా, భీంనగర్ లో వెలసిన అక్రమ డబ్బాలను తొలగించిన మున్సిపల్ అధికారులు పట్టణంలో అనేక ప్రాంతాలలో డబ్బాలను కూడా తొలగించే విధంగా గద్వాల మున్సిపల్ కౌన్సిల్ తీర్మాణం చేయాలని కోరారు. డబ్బాలు వేసి కిరాయిలకు ఇచ్చి అక్రమార్జనకు పాల్పడుతున్న అక్రమార్కులు నెలనెలా వస్తున్న కిరాయిలతో కడుపు నిండుతోంది కాని కష్టం చేస్తున్న చిరు వ్యాపారుల పొట్టలు మాత్రం నిండటంలేదు.

# బిసి సంక్షేమ కళాశాల (బాలికల & బాలుర) హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఆర్డీవో కి వినతి



దేవరకొండ: ఆగస్టు 31 (సమయం ప్రతినిధి) : దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలుర, బాలికల కళాశాల హాస్టల్లకు సొంత భవనాలు నిర్మించాలని ఆర్డీవో పి పద్మప్రియ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మారుమూల ప్రాంతం అయినటువంటి దేవరకొండ ప్రాంతంలో బీసీ సంక్షేమ బాలికల బాలుర కళాశాల హాస్టల్లకు సొంత భవనాలు నిర్మించాలని సొంత భవనాలు లేక సరైన మౌలిక వసతులు లేక ఇరుకైనటువంటి అద్దె భవనాల్లో విద్యార్థులను ఇబ్బందులకు గురవుతున్నారని, దోమలు సరైనటువంటి మౌలిక వసతులు లేక చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. దేవరకొండ ప్రాంతానికి సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకొని తిరిగి సొంత గ్రామానికి వెళ్లడానికి సరైన సమయంలో రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనాలు హాస్టళ్లకు నిర్మించినట్లయితే విద్యార్థులు చదువుకొని భవిష్యత్ తరాలకు దిక్సూచిగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి సదరు అధికారులు దీనిపై దృష్టి ఉంచి సొంత భవనాలు నిర్మించే దిశగా ముందుకు అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, పున్న బిక్షమయ్య, మునగాల గణేష్, మోకరాల వెంకటయ్య, మోకరాల వెంకన్న, మోకరాల ఆంజనేయులు, బచ్చయ్య ,కొండల్ తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే







(సమయం ప్రతినిధి–దేవరకద్ర) : చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో భాగంగా పిల్లర్ల నిర్మాణం, కాంక్రీట్ పనులను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) ప్రారంభించారు. అనంతరం నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూదన్ రెడ్డి (GMR) మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు 200 కోట్ల వ్యయంతో విశాలమైన ప్రాంగణాల్లో అంతర్జాతీయ స్థాయి విద్యా వసతులతో ఈ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక టీచింగ్ ఎక్విప్‌మెంట్, అంతర్జాతీయ స్థాయి సైన్స్ ల్యాబ్‌లు, ఇండోర్, ఔట్‌డోర్ క్రీడా మైదానాలు, విశాలమైన డైనింగ్ హాల్, డార్మిటరీ వంటి అనేక అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్ లలో నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు కూడా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, ఆధునిక సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మన దేవరకద్ర నియోజకవర్గంలో పట్టణాలు, గ్రామాలకు దూరంగా, పచ్చని ప్రకృతి మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో 22 ఎకరాల విస్తీర్ణంలో ఈ పాఠశాల నిర్మాణం జరుగుతోందన్నారు. 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సుమారు 2,720 మంది విద్యార్థులకు విద్యను అందించేలా ఈ పాఠశాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, విద్య అనేది భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గొప్ప పెట్టుబడి గా భావించి, ముఖ్యమంత్రి విద్యా రంగంలో అనేక సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి ఒక విజనరీ లీడర్‌గా తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్య, వైద్యం, వ్యవసాయం, ఇరిగేషన్ వంటి అన్ని రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ విషయాన్ని తాము గర్వంగా చెబుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌తో పాటు తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు, దేవరకద్ర నియోజకవర్గంలోని కౌకుంట్ల వద్ద తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటుకు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. విద్యా రంగంలో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గొప్ప అవకాశాలను అందించడంతో పాటు, రాబోయే తరాల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## TUCI తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ జయప్రదం చేయండి

### TUCI తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం




వనపర్తి : ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (TUCI) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ 2026 సెప్టెంబర్ 6న ఖమ్మం పట్టణం కేంద్రంలో నిర్వహించబడుతుంది. ఈ జనరల్ కౌన్సిల్ కు ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని TUCI రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం పిలుపునిచ్చారు. 31/08/2026 నాడు వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినా కార్యకర్తలు జనరల్ బాడీలో మాట్లాడుతూదేశంలో కార్మిక వర్గ పరిస్థితులు రోజుకి దిగజారి పోతున్నాయి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోర్సుగా మార్చి కార్మిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడింది సమ్మె హక్కును కాల రాసింది కార్మికులు సంఘటితంగా తమ ప్రజాసామిక హక్కుల కోసం అడిగే పరిస్థితి లేకుండా చేసింది. దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు స్వదేశీ దేశభక్తి బిజెపి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో 100% పెట్టుబడులను ఆహ్వానిస్తున్నది వానింజ ఒప్పందాలలో దేశ ప్రజలకు రైతులకు కార్మికులకు నష్టకరమైన ఒప్పందాలను కుదుర్చుకున్నది దేశంలోని కార్పొరేట్ బడా పారిశ్రామికవేత్తలకు దేశ కార్మిక వర్గ శ్రమ శక్తిని పణంగా పెట్టింది. ఇలాంటి అనేక కేంద్ర ప్రభుత్వ విధానాలపై హర్యానా ఉత్తరప్రదేశ్ ఝార్ఖండ్ మహారాష్ట్ర గుజరాత్ తదితర ప్రాంతాలలో పారిశ్రామిక కార్మికులు వేలాది మందితో వీధిలోకి వచ్చి హక్కుల కోసం నినదించిన విషయం మనందరికీ తెలుసు అన్నారు. ఇలాంటి అనేక విశాలపై రాష్ట్ర జనరల్ కౌన్సిల్లో విస్తృతమైన చర్చ జరిపి భవిష్యత్ కార్యక్రమాలు కార్మిక వర్గ పోరాటాలను రూపొందించుకోవడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో TUCI జిల్లా సహాయ కార్యదర్శి గణేష్ టియుసిఐ జిల్లా నాయకులు N శీను భవన నిర్మాణ కార్మికులు చెన్నయ్య వెంకటయ్య తిరుపతి పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల చేయూత పెన్షన్ ఆప్షన్ కై హైకోర్టును ఆశ్రయిస్తాం!!

### టి యు సి ఐ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం వెల్లడి



(సమయం ప్రతినిధి అమర చింత) : పొగ పారిపోతున్న బీడీ బతుకులకు జీవన భృతి మంజూరు చేస్తూ ఆసరా కల్పించిన ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం. 2014 నాటికి ప్రావిడెంట్ ఫండ్ వర్తించే వారికి మాత్రమే భృతి మంజూరు చేశారు. దానిపై తాము ము తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాత ప్రావిడెంట్ ఫండ్ కటఫ్ డేటును ఎత్తివేశారు. నేడు అధికారం లోకి వచ్చిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అంటూ మాట్లాడిన రేవంత్ రెడ్డి పెన్షన్ మంజూరులో బీడీ కార్మికుల ఆప్షను ఎందుకు ఎత్తివేసాడో సమాధానం చెప్పాలి. ఆగస్టు 30 నాడు అమరచింత మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (TUCI) రాష్ట్ర ఉపాధ్యక్షులు కే సూర్యం మాట్లాడుతూ చేయూత పెన్షన్ ఆప్షన్ లో బీడీ కార్మికుల ఆప్షన్ లేకపోవడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు . ఈ విషయం గురించి ఈనెల 14వ తారీఖు నాడు ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చాము. అలాగే సెక్రటేరియట్ లో సీయం రేవంత్ రెడ్డి ఛాంబర్ లో మరియు చీఫ్ సెక్రటరీ కు వినతి పత్రాలు ఇచ్చాము. తక్షణమే బీడీ కార్మికుల ఆప్షన్ను ఏర్పాటు చేయండి అని బీడీ కార్మికులకు చేయూత లేకుండా చేయవద్దని కోరాము. ఈ నెలలో నిజామాబాదు, నిర్మల్, నారాయణపేట, వనపర్తి జిల్లా కేంద్రాలలో బీడీ కార్మికులకు చేయూత పెన్షన్‌లో ఆప్షన్ పొందుపరచాలని ధర్నాలు చేసి వినతి పత్రాలను జిల్లా కలెక్టర్లకు సమర్పించామని అయినప్పటికీ ప్రభుత్వ నుండి ఎలాంటి స్పందన లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కనక వెంటనే బీడీ కార్మికులకు చేయూత పెన్షన్ లో అవకాశం కల్పిస్తూ దరఖాస్తులు తీసుకోవాలని గడువు తేదీని పొడిగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.. ప్రభుత్వం బీడీ కార్మికులకు న్యాయం చేసేటట్లు తక్షణమే పెన్షన్ దరఖాస్తులు బీడీ కార్మికులకు ఆప్షన్ ఉండేటట్లు పొందుపరిచి దరఖాస్తులు స్వీకరించాలని డిమాండ్ చేస్తున్నాం. లేనిచో హైకోర్టులో రిట్ వేసి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కే సూర్యం, తో పాటు TUCI జిల్లా ఉపాధ్యక్షులు సి రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్,కార్మిక నాయకులు మస్తామని, సత్యనారాయణ, జిలాని, నారాయణ, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి

## తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి

హైదరాబాద్ : ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయనిధి (CMRF) రూ.45,31,100/- రూపాయల విలువైన 150 చెక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. చిన్నా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రేపటికి సెప్టెంబర్ ఒకటి నాటికి విజయవంతంగా వెయ్యి రోజుల మైలురాయిని చేరుకుంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను పాలనకు కేంద్ర బిందువుగా చేసుకొని సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తూ వెయ్యి రోజుల పరిపాలన తెలంగాణ ప్రగతిలో కొత్త అధ్యాయన్ని నమోదు చేసుకుంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి పేద వారికి అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వ అప్పులను తీరుస్తూనే,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తున్నామని అన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ లేనివారికి చికిత్స అనంతరం జవీ=ఖీ ద్వారా కొంత ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను గుర్తించి సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయం పేదోళ్ల ఆరోగ్యానికి కొండంత ఆసరాగా నిలుస్తుందని అన్నారు. వనపర్తి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా మానవతా దృక్పథంతో అందరికీ CMRF చెక్కులను అందజేస్తున్నామని అన్నారు. లిసీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి కి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర మైనార్టీ నాయకులు అక్తర్,వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, సోషల్ మీడియా కోకో ఆర్డినేటర్ చంద్రశేఖర్, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున,వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా, వనపర్తి మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల చంద్రశేఖర్, పెబ్బేర్ మండల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అనిల్, అయ్యవారిపల్లె సర్పంచ్ కురుమన్న,సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, సహదేవుడు, మన్యం యాదవ్, రాముడు, హరిబాబు రెడ్డి, ఇమ్రాన్, శ్రీధర్, వెంకటేష్ సాగర్, ఆనంద్ సాగర్, శివ నారాయణ, చెన్నయ్య, వెంకటేష్, నాగన్న గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, నరసింహ, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.



## కీసరలో అక్రమ మట్టి రవాణాకు చెక్.. మూడు లారీలు సీజ్

వేకువ సమయం ఆగష్టు 31 కీసర ప్రతినిధి : మేడ్చల్ జిల్లా : కీసర మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, నిబంధన లకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసినట్లు సమాచారం. ఆర్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిర్వహించిన తనిఖీలతో మట్టి అక్రమ రవాణాదారుల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. ఇప్పటివరకు యథేచ్ఛగా సాగుతున్న మట్టి తరలింపులకు అధికారులు బ్రేకులు వేస్తారా? అన్న చర్చ స్థానికంగా మొదలైంది. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు? కీసర మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వ్యక్తులు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వకాల కారణంగా వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, సహజ భూస్వరూపం దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉంది. మూడు లారీలేనా.. ఇంకా ఎన్ని? తాజాగా మూడు లారీలను సీజ్ చేయడం అధికారుల చర్యలకు నిదర్శనంగా నిలిచింది. అయితే కీసర మండలంలో ఇప్పటివరకు ఎన్ని ప్రాంతాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిగాయి? ఎంతమేర మట్టి తరలించారు? ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారు? లారీలను ఎవరు నిర్వహిస్తున్నారు? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. సీజ్ చేసిన లారీలపై ఎలాంటి కేసులు నమోదు చేశారు? జరిమానా విధించారా? తదుపరి చర్యలు ఏమిటి? అనే అంశాలపై రెవెన్యూ అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది. వాహనాల సీజ్‌తో సరిపెట్టొద్దు అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలంటే కేవలం లారీలను సీజ్ చేయడం మాత్రమే కాకుండా, మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలను



ఉల్లంఘించి తవ్వకాలు జరుగుతున్నాయా? అన్న అంశంపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ తవ్వకాల వెనుక ఉన్న అసలు నిర్వాహకులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మట్టి తరలింపు మార్గాలపై నిరంతరం నిఘా పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇక మట్టి మాఫియాకు చెక్ పడేనా? తాజా తనిఖీలు కేవలం ఒక్కరోజు చర్యలకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగాలని ప్రజలు కోరుతున్నారు. కీసర మండలంలోని అనుమానిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పా టు చేసి, అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మూడు లారీల సీజ్‌తో మొదలైన ఈ చర్యలు మట్టి మాఫియా మూలాల వరకు వెళ్తాయా? అక్రమ తవ్వకాల వెనుక ఉన్న అసలు సూత్రధారులపై ఉక్కుపాదం మోపుతారా? కీసరలో మట్టి అక్రమ రవాణాకు శాశ్వతంగా చెక్ పడుతుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ మార్చవద్దు.. సూర్యాపేట మీదుగానే నడపాలి: బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్‌కు మాజీ ఎమ్మెల్యే సంకినేని వినతి

హైదరాబాద్ (ఆగస్టు 31, 2026): శంషాబాద్ – చెన్నై బుల్లెట్ రైలు ప్రాజెక్టును జాతీయ రహదారి 65 (NH 65) వెంబడి, సూర్యాపేట స్టేషన్ అలైన్‌మెంట్ ప్రకారమే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర నాయకులు & మాజీ శాసనసభ్యులు శ్రీ సంకినేని వెంకటేశ్వరరావు గారు ఈరోజు హైదరాబాద్‌లో నిర్మల్ శాసనసభ్యులు & బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో బుల్లెట్ రైలును సాగర్, హాలియా వైపు తిప్పి, సూర్యాపేట, నార్కట్‌పల్లి లాంటి ప్రధాన పట్టణాలకు అన్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనలు తీసుకురావడాన్ని సంకినేని వెంకటేశ్వరరావు గారు తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర ప్రభుత్వ స్వార్థ, రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం పంపిన తప్పుడు నివేదికలను పక్కనబెట్టి, పాత ప్రతిపాదన ప్రకారమే సూర్యాపేట జిల్లా కేంద్రంగా బుల్లెట్ రైలు స్టేషన్ వచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ వినతిపై బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ కుట్రలను అడ్డుకుని, సూర్యాపేట ప్రాంత ప్రజల ఆకాంక్షల ప్రకారం పాత రూట్ లోనే ప్రాజెక్ట్ సాగేలా కేంద్ర రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నరసింహ, పీఎం విశ్వకర్మ యోజన జిల్లా కన్వీనర్ సలిగంటి వీరేందర్ లు ఉన్నారు.





# పేదవాడి సొంతింటి కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం మంత్రి సతీమణి వాకిటి లలిత

(సమయం ప్రతినిధి మక్తల్): మక్తల్ నియోజకవర్గం అమరచింత మండలం కొంకనోనిపల్లి గ్రామంలో మాధవి,గోవర్ధన్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ దంపతులను అభినందించి, వాకిటి వారి ప్రత్యేక కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వాకిటి లలిత మాట్లాడుతూ.. పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తాను ఎంపీటీసీగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మరోసారి పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని లలిత పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి బిజీ షెడ్యూల్ కారణంగా తాను గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యానని, మంత్రి గారి తరఫున వాకిటి వారి కానుకను అందజేయాలని ఆయన



ఆదేశించారని తెలిపారు. కొత్త ఇంటిలో మాధవి,గోవర్ధన్ కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్



నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.







# పెండింగ్‌లో 12,000 కోట్ల స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి





నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 31: తెలంగాణ ఏబీవీపీ రాష్ట్ర పిలుపుమేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) నాగర్ కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై మరియు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ రిటంబర్స్ మెంట్ తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ విద్యార్థులతో MRO ఆఫీస్ ముందు ABVP నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ఏబీవీపీ నాయకులు డిప్యూటీ వీ=ూ గారికి వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు, నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన సుమారు రూ.12,000 కోట్ల బకాయిలు విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు విద్యను అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం, బకాయిలను విడుదల చేయకుండా వారి విద్యాభ్యాసానికి ఆటంకం కలిగించడం సరికాదని ఏబీవీపీ నాయకులు అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రభుత్వం తమ డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే విద్యార్థులంతా ఏకమై ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ, మార్కండేయ, డానియల్, లోకేష్, జగన్, మహేష్, భరత్,శివ ఏబీవీపీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం: ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో రామిడి స్వప్న విజయరెడ్డి

వేకువ సమయం ఆగష్టు 31 కీసర ప్రతినిధి : కీసర/చీర్యాల: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాల్లో కీసర డివిజన్-1కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయరెడ్డి పాల్గొన్నారు. కీసరదయారలో నక్క మమత జంగీర్, చీర్యాలలో పట్నం మొగులమ్మ లక్ష్మయ్య కుటుంబాల నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి, నూతన గృహాల్లో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్వప్న విజయరెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతోమందికి భరోసాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల విజయవంతానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను వేగవంతం : పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల ఎంపికను

## - మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి ఆగస్టు 31 : కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పనుల పురోగతి, పెండింగ్ సమస్యలు, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. వీపనగండ్ల మండలానికి 375 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా ఇప్పటివరకు 321 మంది లబ్ధిదారులను గుర్తించారని, ఇంకా 54 మంది లబ్ధిదారుల ఎంపిక పెండింగ్‌లో ఉందని అధికారులు మంత్రికి వివరించారు. మొదటి విడత లబ్ధిదారుల ఎంపికే ఇంకా పూర్తికాకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా ఇందిరమ్మ కమిటీ సమావేశాలు నిర్వహించి, రెండు మూడు రోజుల్లోగా పెండింగ్ లో ఉన్న 54 మంది లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక అనంతరం గెజిటెడ్ అధికారుల వెరిఫికేషన్, శాంక్షన్ ప్రక్రియను కూడా ఆలస్యం చేయకుండా పూర్తి చేయాల న్నారు. మొదటి విడతలో లబ్ధిదారులను గుర్తించి శాంక్షన్ చేయకుండా ఇళ్లను పెండింగ్‌లో ఉంచినట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొరపాటుగా L3 జాబితాలో నమోదైన అర్హులైన లబ్ధిదారులను పంచాయతీ కార్యదర్శులు గుర్తించి సంబంధిత



ఎంపీడీవోలకు వివరాలు అందించాలని మంత్రి సూచించారు. హౌసింగ్ లాగిన్‌లోని L3 to L1 Module ద్వారా అర్హులైన వారి ప్రతిపాదనలను వారం రోజుల్లోగా జిల్లా కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడే పరిష్కరించాలని సూచించారు. గెజిటెడ్ అధికారులు తమ శాఖకు సంబంధించిన విధి కాదనే కారణంతో వెరిఫికేషన్‌ను వాయిదా వేయరాదన్నారు. నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అందించే కార్యక్రమంలో మానవతా దృక్పథంతో పనిచేసి, వెరిఫికేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామీణాభివృద్ధి, సాగునీటి పారుదల, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, హౌసింగ్, పంచాయతీ రాజ్ - గ్రామీణాభివృద్ధి, టీజీఎస్ఆర్టీసీ,, ఐసీడీఎస్, దేవాదాయ, భూసేకరణ, రెవెన్యూ శాఖల పరిధిలోని అంశాలపై మంత్రి సమీక్షించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, సాగునీరు, రహదారులు, తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత, వేగం పాటించాలని మంత్రి ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.




సినిమా విడుదలకు పండుగ సీజన్ అంటే నిర్మాతలకు ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. వరుస సెలవులు, ప్రేక్షకులకు అందుబాటులో ఉండే సమయం కారణంగా ఈ సమయంలో సినిమాలకు భారీ ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే సంక్రాంతి, దసరా, వేసవి సెలవులను టార్గెట్ చేస్తూ పెద్ద సినిమాలు తమ రిలీజ్ డేట్లను ముందుగానే ఖరారు చేసుకుంటుంటాయి. ప్రస్తుతం దసరా సీజన్ విషయంలో టాలీవుడ్, కోలీవుడ్ సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంటోంది. ముఖ్యంగా పాన్ ఇండియా సినిమాల లెక్క పెరగడంతో భాషలతో సంబంధం లేకుండా సినిమాలు ఇతర రాష్ట్రాల్లోనూ భారీగా విడుదలవుతున్నాయి. దీంతో ఒకే సమయంలో పలు భారీ చిత్రాలు థియేటర్లలోకి వస్తే స్క్రీన్ల కేటాయింపు విషయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇప్పుడు ఇదే పరిస్థితి దసరా సీజన్‌లో కనిపించేలా ఉంది. రజినీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2'ను అక్టోబర్ 15న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ డేట్‌పై మేకర్స్ భారీ అంచనాలతో ఉన్నారు. అయితే ప్రస్తుతం కొన్ని తెలుగు సినిమాలు కూడా దసరా సెలవులను టార్గెట్ చేస్తూ రిలీజ్ డేట్లను ఖరారు చేసుకునే ప్రయత్నం చేస్తుండటంతో 'జైలర్ 2'కు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల విషయంలో పోటీ తప్పదనే చర్చ మొదలైంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2న విడుదల కావాల్సి ఉండగా.. అక్టోబర్ 9కు మార్చారు. అదే సమయంలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న 'రణబాలి' విషయంలోనూ రిలీజ్ డేట్‌పై మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత సెప్టెంబర్ 11న ఈ సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ, ఆ తేదీని ఆనంద్ దేవరకొండ నటిస్తున్న 'ఎపిక్' కోసం కేటాయించే ప్రయత్నాలు జరిగాయి. దీంతో 'రణబాలి'ని అక్టోబర్ 16న విడుదల చేయాలని మైత్రి మూవీ మేకర్స్ ఇప్పటికే ప్రకటించింది. దసరా సీజన్‌లో పలు భారీ తెలుగు సినిమాలు థియేటర్లలోకి వచ్చే పరిస్థితి కనిపిస్తుండటంతో స్క్రీన్స్ కేటాయింపుపై చర్చ మొదలైంది. ముఖ్యంగా 'జైలర్ 2' అక్టోబర్ 15న వస్తుండగా.. అక్టోబర్ 16న మరో తెలుగు భారీ చిత్రం విడుదలైతే తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల పంపిణీ విషయంలో పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 'జైలర్ 2' రిలీజ్ డేట్‌ను మేకర్స్ మార్చే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం సోషల్ మీడియాలో జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. రజినీకాంత్ సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మార్కెట్‌ను కూడా తక్కువగా అంచనా వేయలేం. 'జైలర్' తెలుగు వెర్షన్ కూడా మంచి విజయాన్ని అందుకోవడంతో 'జైలర్ 2'పై అంచనాలు భారీగా ఉన్నాయి. రజినీకాంత్‌కు ఉన్న స్టార్ ఇమేజ్, ఆయన సినిమాలకు తెలుగు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ కారణంగా పోటీ ఉన్నప్పటికీ ఈ సినిమాకు భారీ ఓపెనింగ్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల తమిళ సినిమాలు కూడా తెలుగు మార్కెట్‌లో మంచి వసూళ్లు సాధిస్తున్న నేపథ్యంలో డబ్బింగ్ చిత్రాలపై ప్రేక్షకుల ఆసక్తి పెరిగింది. దీంతో 'జైలర్ 2'కు సరైన థియేటర్లు లభిస్తే తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉంది. దసరా రేసులో తెలుగు సినిమాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ 'జైలర్ 2'కు స్క్రీన్ల కేటాయింపు ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. పోటీని ఎదుర్కొంటూ రజినీకాంత్ సినిమా అదే తేదీన వస్తుందా? లేక విడుదల తేదీని మార్చుకుంటుందా? అనేది అధికారిక ప్రకటన వచ్చే వరకు సస్పెన్స్‌గానే ఉండనుంది.




'బలగం', 'మసూద' చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి కావ్య కళ్యాణ్ రామ్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలనటిగా కెరీర్ ని మొదలుపెట్టి.. హీరోయిన్ గా మారిన కావ్య ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా మారింది. గత కొన్నేళ్లుగా కావ్య.. ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు కాలభైరవతో రిలేషన్ లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. కీరవాణి పెద్ద కొడుకు కాలభైరవ ప్రస్తుతం సింగర్ గా, మ్యూజిక్ డైరెక్టర్ గా కొనసాగుతున్న విషయం తెల్సిందే. వీరిద్దరూ ప్రేమలో ఉన్నారు.. త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కనున్నట్లు పుకార్లు వచ్చాయి. అనేక బహిరంగ కార్యక్రమాలు, ఫంక్షన్లలో వీరిద్దరూ కలిసి కనిపించడంతో ఈ రూమర్లకు మరింత బలం చేకూరింది. తాజాగా ఈ జంట తమ రిలేషన్‌షిప్‌పై స్పష్టతనిచ్చారు. తామిద్దరం ప్రేమలో ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. కావ్య కళ్యాణ్ రామ్.. కాలభైరవతో కలిసి ఉన్న ఫోటోలను షేర్ చేస్తూ 'కొందరు మన జీవితంలోకి వచ్చి, మనం దేవుడికి అత్యంత ప్రియమైన బిడ్డలమేమో అనే భావనను కలిగిస్తారు. సరిగ్గా మనకు తగిన సరైన వ్యక్తి మన జీవితంలోకి అడుగుపెట్టినప్పుడు, గులాబీ రంగు అద్దాల ద్వారా ప్రపంచాన్ని చూడటం అంత చెడు విషయమేమీ కాదనిపిస్తుంది. నేను వద్దు అని చెప్పినప్పటికీ, నాకు డైట్ కోక్ మాత్రమే కావాలని గ్రహించే నువ్వు.. ఇలాగే మరిన్ని ఏళ్ళు నన్ను అర్థం చేసుకుంటూ నాతో ఉండాలి' అని చెప్పుకొచ్చింది. ప్రతీరోజూ ఎంతో సాధారణంగా సాగిపోయే క్షణాలను కూడా వెలిగించి, తనను ప్రపంచంలోనే అత్యంత అదృష్టవంతమైన అమ్మాయిగా భావించేలా చేస్తున్నందుకు ఈ ప్రత్యేక వ్యక్తికి ధన్యవాదాలు అంటూ తెలిపింది. ప్రస్తుతం ఈ క్యూట్ అండ్ ఎమోషనల్ పోస్ట్ సోషల్ మీడియాలో నెటిజన్లు, సినీ ప్రముఖులు, అభిమానుల దృష్టిని విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ జంటకు పెద్ద ఎత్తున కామెంట్స్ రూపంలో శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వీరి ప్రేమకి, పెళ్లికి ఇరు కుటుంబాల పెద్దలు కూడా ఆమోదం తెలిపారని, త్వరలోనే వివాహ నిశ్చితార్థం, పెళ్లి తేదీలను అధికారికంగా ప్రకటించనున్నారని సమాచారం.




ఆగస్ట్ నెల టాలీవుడ్ బాక్సాఫీస్‌కి కాస్త ఊపిరి పోసిన నెలగా నిలిచింది. వరుసగా వచ్చిన సినిమాల్లో కొన్ని ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే కాకుండా మంచి వసూళ్లు సాధించాయి. మరికొన్ని భారీ అంచనాలతో వచ్చి పూర్తిగా నిరాశపరిచాయి. ముఖ్యంగా నాలుగు సినిమాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేయగా.. ఒక భారీ చిత్రం మాత్రం అంచనాల భారాన్ని మోయలేకపోయింది. మొత్తంగా చూస్తే ఆగస్ట్ నెల టాలీవుడ్‌కి మిశ్రమ ఫలితాలతో పాటు కొత్త ఉత్సాహాన్ని కూడా అందించింది.

'కొరియన్ కనకరాజు'తో జోష్ : ఆగస్ట్ తొలి వారంలో వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్‌కి మంచి ఆరంభాన్ని ఇచ్చింది. సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్‌కు ఈ సినిమా కాస్త ఊరటనిచ్చింది. కథలో కామెడీని చక్కగా మిక్స్ చేయడం సినిమాకు ప్లస్‌గా మారింది. ముఖ్యంగా సత్యతో వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను నవ్వించాయి.




సాధారణంగా ఏ సినీ పరిశ్రమలోనైనా అగ్ర హీరోల సినిమాలు వస్తున్నాయంటే చాలు.. బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్, రికార్డు కలెక్షన్లు ఖాయం. కానీ మలయాళ చిత్ర పరిశ్రమ ట్రెండ్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. అక్కడ స్టార్ ఇమేజ్ థియేటర్ల వద్దకు ప్రేక్షకులని తీసుకొస్తుందేమో కానీ, సినిమాను బ్లాక్‌బస్టర్ చేయాలంటే మాత్రం బలమైన కథ, కథనాలు ఉండాల్సిందేనని మలయాళ ఆడియన్స్ పదే పదే నిరూపిస్తున్నారు.

స్టార్స్ ఉన్నా నిలవని భారీ చిత్రాలు

భారీ బజ్, భారీ తారాగణంతో వచ్చిన పలు పెద్ద సినిమాలు కథలో బలం లేకపోవడంతో బాక్సాఫీస్ వద్ద పూర్తిస్థాయి ప్రభావం చూపలేకపోయాయి. 'పేట్రియాట్, వృషభ, బరోజ్, కింగ్ ఆఫ్ కొత్త, టర్బో, నడికర్' వంటి చిత్రాలు విడుదలకు ముందు విపరీతమైన హైప్ క్రియేట్ చేసినప్పటికీ, థియేటర్లలో పూర్తిస్థాయిలో కలెక్షన్లను రాబట్టలేకపోయాయి. ఇటీవల భారీ అంచనాలతో వచ్చిన 'ఖలీఫా' వంటి భారీ బడ్జెట్ సినిమా సైతం, ఆ తర్వాత వచ్చిన చిన్న చిత్రాల పోటీ ముందు ఆశించిన మేర నిలబడలేకపోయింది.

కోట్లు కొల్లగొట్టిన చిన్న చిత్రాలు : మరోవైపు, పెద్దగా పేరు లేని నటీనటులు లేదా మీడియం బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన 'రోమాంచం' అనూహ్య విజయాన్ని నమోదు చేసింది.

సూపర్‌స్టార్ మహేష్ బాబు తన తనయుడు గౌతమ్ ఘట్టమనేని 20వ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్ పంచుకున్నాడు. గౌతమ్‌తో కలిసి దిగిన ఒక అందమైన ఫోటోను షేర్ చేస్తూ ఆయన ఎంతో ప్రేమతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపాడు. 'హ్యాపీ 20 ++!! నువ్వు ఈ కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా.. నీ కలలను ఎల్లప్పుడూ ధైర్యంతో, దయతో వెంటాడాలని కోరుకుంటున్నాను. ఈరోజే కాదు, ప్రతీ రోజూ నిన్ను చూసి గర్వపడుతూనే ఉంటాను' అంటూ మహేష్ బాబు ఇన్స్టాగ్రామ్‌లో రాసుకొచ్చాడు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. అభిమానులు, సినీ ప్రముఖులు గౌతమ్‌కి పెద్ద ఎత్తున బర్త్‌డే విషెస్ తెలియజేస్తున్నారు. తండ్రీకొడుకుల బంధం, వారిద్దరి మధ్య ఉన్న పోలికలను చూసి ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గౌతమ్ ప్రస్తుతం న్యూయార్క్ యూనివర్సిటీలో డ్రామా విభాగానికి సంబంధించిన ఉన్నత చదువులు అభ్యసిస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే గౌతమ్ టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనున్నాడు. దీనికోసమే మహేష్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఇక మహేష్ బాబు సినిమాల విషయనికొస్తే.. రాజమౌళి దర్శకత్వంలో వారణాసి సినిమాను పూర్తిచేసే పనిలో ఉన్నాడు. ఈ సినిమా కోసం




ఇండస్ట్రీ మొత్తం వేయికళ్ళతో ఎదురుచూస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. వారణాసి తరువాత మహేష్ ఏ డైరెక్టర్ తో సినిమా చేస్తాడు అని ఇండస్ట్రీలో కొట్టే డిబేట్ మొదలయ్యింది. అనిల్ రావిపూడితో మరోసారి మహేష్ సినిమా చేస్తున్నదంటూ వార్తలు వచ్చాయి. కానీ, ఆ వార్తలను అనిల్ రావిపూడి ఖండించాడు. మరి వారణాసి సినిమాతో మహేష్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడు.. ఆ తరువాత ఏ డైరెక్టర్ కి ఛాన్స్ ఇస్తాడు అనేది చూడాలి.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085